విషయసూచిక

కథ	:	పుట
1. గ్రద్ద, పావురము	:	9
2. తగవులమారి పిల్లులు	:	10
3. ఆడుసింహము, నక్క	:	12
4. పిల్లి, నక్క	:	13
5. పంది, తోడేలు	:	14
6. గుఱ్ఱము, గాడిద	:	15
7. తోడేలు, మేక, గొఱ్ఱెపిల్ల	:	16
8. కాకి, నక్క	:	17
9. నెమలిని పక్షి రాజుగా జేరుగోరుట	:	19
10. ఏదుబంది, పాములు	:	21
11. దుర్మార్గపు గప్ప	:	21
12. బంగారపు గ్రుడ్లుపెట్టు బాతు	:	23
13. తెలివిమాలిన దుప్పి	:	24
14. కప్పలు రాజును గోరుకొనుట	:	26
15. తాబేలు, కుందేలు	:	28
16. పులి, నక్క	:	29

17. అబోతులు, సింహము	:	30
18. గొఱ్ఱెపిల్ల, తోడేలు	:	32
19. ఎద్దులు, బండిచక్రములు	:	33
20. తోడేలు, కొంగ	:	34
21. తెవులుగొంటు దుప్పి	:	35
22. వేటకాడు, పావురము	:	36
23. జ్యోతిష్కుడు, మార్గస్థుడు	:	37
24. తాబేలు, గరుడపక్షి	:	37
25. కప్ప, నక్క	:	39
26. గాడిద, ముండ్లపొద	:	39
27. భరతపక్షి, దానిపిల్లలు	:	41
28. జోస్యుడు	:	42
29. ఎలుగుబంటి, సింహము, లేడి	:	43
30. గ్రద్ద, నక్క	:	44
31. నూతిలో బడ్డ నక్క	:	45
32. వాయువు, సూర్యుడు	:	47
33. సింహము, మృగములు	:	48
34. సింహము, ఎలుక	:	49
35. గ్రద్ద, కప్ప, ఎలుక	:	50

36. చెడ్డకుక్క	:	51
37. ఓకుచెట్టు తెల్లగడ్డ	:	52
38. గొఱ్ఱెతోలు కప్పుకొన్న తోడేలు	:	53
39. తోడేళ్ళు, గొఱ్ఱెలు	:	54
40. ఒంటికంటి జింక	:	55
41. నక్క, తెవులుగొంటు సింహము	:	56
42. డేగ, కాపువాడు	:	57
43. పిల్లి, ఎలుకలు	:	58
44. దుఃఖకరవివాహము	:	59
45. పిచ్చుక, ఇతరపక్షులు	:	60
46. ఎద్దు, కప్ప	:	62
47. పాము, ఆకుజాయి	:	63
48. కుందేళ్ళు, కప్పలు	:	64
49. కడుపు, అవయవములు	:	65
50. ఎద్దు, దూడ	:	66
51. నెమలి, కొంగ	:	67
52. చీమ, మిడుత	:	68
53. బొంతకాకి, నెమళ్ళు	:	70
54. ఇంద్రుడు, బండివాడు	:	71
55. కుక్క, గొఱ్ఱె	:	72

56. కాకి, కుండ	:	73
57. దుప్పి, దుప్పిపిల్ల	:	74
58. తోకలేని నక్క	:	75
59. ఇంద్రుడు, లొట్టిపిట్ట	:	76
60. కాపువాడు, కొంగ	:	77
61. నెమలియొక్క మొఱ్ఱ	:	78
62. పిల్లి, పుంజు	:	79
63. చిఱుతపులి, నక్క	:	80
64. నక్క, మేక	:	81
65. పడుచువాడు, పిల్లి,	:	82
66. చిఱుచేప, జాలరివాడు	:	83
67. గాడిద, కుక్క	:	84
68. బిందె, కుండ	:	85
69. నక్క, కొంగ	:	86
70. కుక్క, నీడ	:	88
71. పావురము, చీమ	:	89
72. సింహము, గాడిద, నక్క	:	90
73. కౌజు, కోడిపుంజు	:	90
74. ఎలుగుబంటి, తేనెయీగలు	:	91
75. దుప్పి, గుఱ్ఱము	:	92

శ్రీ

నీతికథామంజరి

1. గ్రద్ధ, పావురము

అనేక పర్యాయములు గ్రద్ధ యొకటి పావురములను బట్టుకొనుటకయి ప్రయత్నము చేసి, అవి దొరకక సొరిపోయి గూటిలో దూరుచు వచ్చినందున చేసిన ప్రయత్నము విఫలము కాగా దరువాత మాయోపాయ మొకటి యాలోచించి వానిని చేరవచ్చి "ఓ పావురము లారా! మీరు నామనోభావమును కనిపెట్టలేక నే నేమో మీకు శత్రు పక్షమువాడ నని భ్రమ పడి నేను దగ్గఱ రాగానే వృథా భయపడి దూరముగా తొలగుచున్నారు. సాధుపక్షులయిన మీకు నిత్యమును సంభవించుచున్న యాపదలకు దుఃఖపడి మీ హితముగోరి నే నిప్పుడు మీదాపునకు వచ్చినాను. డేగలు మొదలయిన వాని వలన మీకు సదా కలుగుచుండెడి యపాయమునుండి మిమ్ము రక్షింపవలెనన్న సదుద్దేశముతప్ప నామనస్సులో వేఱు చింతలేదు. పనికిమాలిన యవిశ్వాసమును విడిచి మీరందఱు నన్ను, రాజునుగా స్వీకరించెదు పక్షమున మీకు శత్రు భయము కలుగకుండ గాపాడి మిమ్మందఱ నాకడుపులో, బెట్టుకొని యాదరించెదనను' అని హితోపదేశము చేసెను. ఆ పావురము లామాటలకు సంతోషించి యాగ్రద్దను తమ రాజునుగా జేకొనుట కంగీకరించి, సర్వ స్వాతంత్ర్యముల నిచ్చి గృధ్రమునకు రాజ్యాభిషేకముచేసి తా మావిని ప్రభుభక్తి గలిగి సేవించునట్టు ప్రమాణములు చేసెను. అంతట నా గృధ్రరాజు పావురములవద్ద బ్రవేశించి ప్రజలయొక్క

దేహప్రాణములు రాజుయొక్క సొత్తగుటచేత వాని విచ్చవచ్చి నట్టనుభవించుట తనకుగల స్వాతంత్ర్యములలో నొక్కటియని చెప్పి యొక్కొక్క పావురమునే చంపి భక్షింపసాగెను అందుచేత దినదినక్రమమున బలుచబడి హతశేషులయిన పావురములన్నియు నొకచోట జేరి, స్వభావ మెఱుగక పరునికి దమపై నధికారవిచ్చి తమలో దెచ్చిపెట్టుకొన్న పాపఫల మనుభవింపక తీఱదని విలపింప జొచ్చెను.

గీ. పరుల నైసర్గిక గుణంబు లరయకుండ
విశ్వసించిన నాపదల్ వే ఘటిల్లు ;
దీర్ఘ ముగ గ్రొత్తవాని శోధింపకుండ
బ్రియసఖుండవి యంగీకరింప జనదు.

• • • • • • • • • •

2. తగవులమారి పిల్లులు

ఒకనాడు రెండుపిల్లు లొకరియింట రొట్టె యెత్తుకొని వచ్చి, దానిని పంచుకొనుటకు పాళ్ళు తెగనందున రెండును గలిసి న్యాయము పొందుటకయి సభకు బోయెను. ఆ సభయందా మహావ్యవహారమును దీర్చుటకు మర్కటచక్రవర్తి గారు న్యాయాధికారిగా గూరుచుండి రొట్టెను రెండుముక్కలు చేసి పెద్దముక్క నొక ప్రక్కను చిన్నముక్క నొకప్రక్కను త్రాసులోవేసి తూచి, అందొకటి బరువుగా నున్నందున పెద్ద ముక్కనుండి నోరుపట్టినంతముక్క కొరికి న్యాయనిర్ణయము నందు చేతులకేకాక దంతములకుగూడ పని కల్పించెను. అప్పుడు చిన్నముక్క పెద్దదికాగా కోతి విచారపడి "అయ్యో ! ప్రమాదము

సంభవించినదికదా" అని యిప్పుడు పెద్దదైన భాగమునుండి మఱియొకముక్కను కొఱికి నోటికివి గడుపునకును మరల పని పెట్టెను తగవు తీర్చుటయం దద్భుతశక్తిని జూపుచున్న యా న్యాయ దాతయొక్క సామర్థ్యమునుబట్టి యొకదాని తరువాత నొకటి పెద్దముక్క చిన్నదిగాను చిన్నముక్క పెద్దదిగాను మాఱిమారి కోతికడుపు నిండించుచుండుట చూచి పిల్లులు తమ తెలివితక్కువ తెలిసికొని "అయ్యో ! ఇది యెక్కడి న్యాయము ! అంతకంతకు రొట్టె తఱిగిపోవుచున్నది. ఇప్పుడున్నదానిలో చెఱియొకముక్కను మా కిచ్చివేసి మమ్ము బంపుడు. మేము దానితోనే తృప్తి పొందెదము" అని న్యాయాధిపతిని వేడుకొనెను. "మీరు తృప్తి పొందిన మాత్రమున న్యాయము తృప్తిపొందునా ? తొందరపడక మీ యుభయులలో నెవ్వరికిని హెచ్చుతగ్గులు రాకుండ మీ యిరువురకును పూర్ణమయిన న్యాయము దొరకువఱకును కొంచెమోపికే చేయుడు. ధర్మాధికారినని కూర్చుండి పక్షపాతము చూపినపక్షమున నన్ను నలుగురును నిందిం పరా ?" అని పలికి యా యపూర్వ న్యాయాధిపతి యథాప్రకారముగా ముక్కలు కొఱికి దొడలు తాటించుచు న్యాయమును తీర్చసాగెను. ఇంత వఱకును కోతి రొట్టెముక్కలు మ్రింగుచుండగా తాము గుటకలు మ్రింగుచు చూచుచున్న మార్జాలములు శాంతతయంతయు పోగా "అయ్యా ! ఇక మా నిమిత్తము మీ రాయాసపడనక్కఱలేదు. ఈ మిగిలిన రవంత ముక్కను మాకిచ్చివేసి ననుమాలోమేము సమాధానపడి యూరకుండెదము. మీవంటి ధర్మదాతలు లోకలో మఱియెవ్వరును లేరు. దుర్బలులమయిన మమ్మున్యాయము చేయక మీకు దోచినంత దయచేసి మమ్ముపంపివేయు" అని దీనత్వముతో ప్రార్థించెను. అప్పుడు కోతి "అన్యాయమెవ్వరికిని గూడదు. మీకును నాకునుగూడ న్యాయమే కావలెను. ఇంత సేపటినుండి మీ వ్యవ హారముయొక్క

చిక్కు పడకుండుచు మీ విచిత్రమయి శ్రమపడు చున్నందుకయి యిప్పుడు శేషించి యున్న యీ ముక్క నాది." అని తినగా మిగిలిన ముక్కను నోర వేసికొని చేతులు దులిపి "మీలో నెవ్వరికిని పక్షపాతము జరగలేదు. ఒక శ్రీఘ్రముగా మీ యిండ్లకు పొండు" అని తగవు తీర్చి తాను లేచిపోయెను.

గీ. వడిగ సభ కెక్కి తగవులు పడెడువారు
చెఱుచుకొందురు తమతొంటిస్థితినిగూడ,
ఒకరి కింత నష్టంబైన నోర్చి సభకు
బఱవ కింట సమాధానపడుట యొప్పు.

3. ఆడుసింహము, నక్క

ఒకనాడొకసింహమును నక్కయు కలిసి మాటాడుకొనుటలో సంతానమును గూర్చి ప్రసంగము వచ్చెను. ఆ ప్రస్తావనలో నక్క సంతానవిషయమున లోకములోని సమస్త జంతువులలోను తనజాతి మిక్కిలి ధన్యమయినదనియు, తమకు కడుపు చక్కగా ఫలించి ప్రతి సంవత్సరమును మూడు నాలుగేసి పిల్లల చొప్పున సంతానలాభము కలుగుచుండుననియు, చెప్పి కొందరు భాగ్యశాలులీలోకములో రెండు మూడు తడవల కంటె నెక్కువగా బిడ్డలను కన నోచుకోకపోయినను, ఆ కన్నప్పుడైన నొక్క కూనకంటె నెక్కువ పెట్టలేకపోయినను, తమ యంతటివారెవరును లేరని గర్వముచేత విఱ్ఱవీగి యితరులను దమకంటె దక్కువగా జూచుచుందురు." అని సింహమునకు తాకునట్లుగా నెగతాళి చేసెను. సింహ మా పరిహాసమును గ్రహించి రోషముతో, నీ వన్నమాట సత్యమే కావచ్చును. అయినను కొందఱట్లు గర్వపడుటకు హేతువు లేకపోలేదు. నీ వెన్ని సారులు పిల్లల బెట్టినను పెట్టినపుడెల్ల

నీవినను నీ కడుపునన బుట్టిన పన్నిండును నక్కకూనలే. నే నొక్కసారియే బిడ్డనను కన్నను నా కడుపునబుట్టిన దొక్కటియు సింహపుపిల్ల." యని యుత్తరమిచ్చెను.

గీ. శక్తి లేనట్టి దుష్పుత్రశతముకంటె
గుణయుతుం డైనవా డొక్కకొడుకె మేలు ;
ఉత్తమగుణంబు లేకున్న, నొక్కగొప్ప
వంశమున బుట్టినంతనె వాసి లేదు.

4. పిల్లి, నక్క

ఒకనా డొక యడవిలో పిల్లియు నక్కయు గలిసి యాత్మ రక్షణోపాయములను గూర్చి మాటాడుకొనుచుండగా నక్క "నాకు వేయిమాయలు తెలియును. కాబట్టి శత్రువులు తారసించినప్పుడు నే నేమాయోపాయము చేతనైన తప్పించుకోగలను. శత్రుభయము కలిగినప్పుడు నీ వెట్లు ప్రాణరక్షణము చేసికో గలుగుదువు." అని పిల్లి నడిగెను. "మిత్రుడా ! నాకొక్క యుపాయముమాత్రము తెలియును. నాకు తెలిసిన యాయొక్క యుపాయమును తప్పిపోయినయెడల నేను ప్రాణములకు నీళ్ళు వదలుకోవలసినవాడనే" అని పిల్లి చెప్పెను. "పరితాపకరమయిన నీ దుస్థితికి నా మనస్సు ఖేదపడుచున్నది. కానిమ్ము. నీ యసహాయస్థితికి చింతిలబోకు. సమయము వచ్చినప్పుడు నాయుపాయములలో నొకటిరెంటి నీకు నేర్పెదనులే." అని నక్క పిల్లి నూఱడించుచుండెను. ఈ మాటలు నోటనుండగానే యచ్చటికి వేటకుక్కలు పరుగెత్తుకొని వచ్చెను. అప్పుడు పిల్లి తనకు దెలిసిన యొక్క విద్యతోను శీఘ్రముగా చెట్టుమీది కెగబ్రాకి తన ప్రాణములు

కాపాడుకొనెను. నక్కమాత్రము తా నెఱిగిన కోటి విద్యలలోను రక్షణమార్గమును గానక కొంతదూరము పరుగెత్తి తుదకు కుక్కలకు చిక్కి ప్రాణములు విడిచెను.

గీ. బూటకము లైనవిద్యలు నూటికంటె
నుత్తమం బైనసద్విద్య యొకటి మేలు,
ఎల్ల విద్యల వింత వే లిడుటకంటె
నొకటి చక్కగా నేర్చిన నాదవు సుఖము.

• • • • • • • • • • •

5. పంది, తోడేలు

పిల్లలపంది యొకటి తన పిల్ల లెల్లను చుట్టునుజేరి యాడు కొనుచుండగా వేడుక చూచుచు వాని సమీపమున గూరుచుండెను. అప్పుడాదారిని బోవుచున్న తోడేలొక్కటి పంది పిల్లలను జూచి వానిలో నొక్కదానిని తన గర్భమునందు జొప్పింపవలెనని యెంచి, తనకోరిక తీర్చుకొనుటకు మార్గము కానక వానితల్లితో స్నేహముచేసి తదనుగ్రహ సంపాదనము చేయదలచి మెల్లగా సమీపమునకు వచ్చి "ఓ యిల్లాలా ! నీవు బిడ్డలతో సుఖముగా నున్నావా ? గంపెడు పిల్లలను నిన్నును చూచుటచేత నాకు కన్నుల పండువుగా నున్నది. ఈ పిల్లలను రక్షించుటలో నీకు నావలనితోడ్పాటేమైన గావలసి యున్నయెడల నీవిని నా కడుపులో బెటుననీకు మాఱుగా పెంచుటకు నేను సిద్ధముగా నున్నాను. నీకిష్టమున్న యెడల నీ బిడ్డలను నాకొప్పగించి కొంచెముసేపు దూరముగా బోయి మంచిగాలి యనుభవించి రావచ్చును." అని తన శిశు వాత్సల్యమును గనబఱిచెను. "అయ్యో!

మీ హృదయములోని దయారసమంతయు నాకు బోధపడినది. నావంటి యల్పులు తమవంటి పెద్దల కాయాసము కలుగజేయుట యపచారమగును. తమరు క్షేమసమాచారమును విచారించుటకయి తఱచుగా శ్రమపడి యిక్కడకు విజయం చేయకుండుటయే నా యభిమతము. కాబట్టి మీకు మాపీద నిజ మయిన యనుగ్రహ మున్న పక్షమున, మీరు మఱియెప్పుడును మాకు దర్శన మీయక మీచాటున మమ్మొంటిగా బ్రతుకనిండు. ఇదియే మీరు మాకు జేయవలసిన మహోపకారము." అని ప్రార్థించి వందితోడేలను సాగనంపెను.

గీ. క్రొత్తవారలు తమయంత గూర్మిచూప
వత్తురేనియు శంకింపవలయు వారి ;
బాలు రన్యుల యుపచారవాక్యములను
శీఘ్రముగ విశ్వసించుచు జెడుదు రిలను.

• • • • • • • • • • •

6. గుఱ్ఱము, గాడిద

యుద్ధభూమికి గొనిపోవుటకయి మంచి జీనుకట్టి యలంక రించుటచేత సంతోషము పట్టజాలక పర్వతగుహలు మాఱుమ్రోయు నట్లుగా సకిలించుచు గుఱ్ఱ మొకటి నానాముఖముల పరుగులెత్త మొదలు పెట్టెను. అప్పుడు పెద్దబరువు మీద వేసి కొని మోయలేక కాళ్ళీడ్చుకొనుచు నడుచుచున్నగాడిద యొకటి మార్గమధ్యమున దాని కంటబడెను. ఆ గార్దభమును జూచి గుఱ్ఱము మహా గర్వముతో "నీవు దారి తొలగి దూరముగా పో. నీ మందగమనము విడిచి వేగిరము కదల లేక పోయితివా నీవు నా కాలిక్రిందబడి నలిగిపోదువుసుమా."

అని పరిహాసముగా బలికెను. గర్వాంధతచేతగ్రిందుచూడక గంతులు వేయుచున్న గుఱ్ఱముముందర మఱుమాట పలుకుటకు సాహసింపక యాగాడిద మెల్లగా నొకయోరకొత్తిగిలి దానికి దారి యిచ్చెను. ఇట్లు జరిగిన కొంతకాలమున కాగుఱ్ఱము యుద్ధములో గాయపడి కుంటి దయి యొక కాపువాని కమ్ముబడివాడు తనమీద మూటలువేసి తోలుకొని పోవుచుండగా కుంటికాలితో మెల్లగా నడచుచు మరల నాగాడిద కెదురు పడెను. అప్పుడాగాడిద ప్రతి సత్కారము చేయుటకు తన కిప్పుడు వంతు వచ్చినదని భావించి "ఓ మిత్రుడా!" అని పిలిచి, "నాడు నా నడకను జూచి పరిహసించిన మహానుభావులు కారా తమరు ? అప్పటి మీ గర్వమును జూచి తమకెప్పుడో యిట్టి యవస్థ పట్టునని నేను నాడే నా మనస్సులో ననుకొన్నాను" అని పలుకరించెను.

గీ. ముందు గర్వంబు నడచు, నెప్పుడును దాని
వెనుకనే యవమానంబు జనుచునుండు ;
గర్వితుని కాపద యొకింత కలుగునేని,
ఉల్లముల సంతసిల్లుదు రెల్లజనులు.

● ● ● ● ● ● ● ● ● ● ●

7. తోడేలు, మేక, గొఱ్ఱెపిల్ల

ఒక దినము మేక యొకట గొఱ్ఱెపిల్లకు పాలిచ్చుచుండగా తోడేలు చూచి "ఓ వెఱ్ఱి శిశువా ! ఇది నీ కన్నతల్లిగాదు; అదిగో నీ తల్లి యక్కడ మందలో మేయుచున్నది. అక్కడకు పోదమురా" అని దూరముగ్నా యొక గొఱ్ఱెలమందను చూపెను. "అయ్యా ! మీ రిప్పుడు చూపినది నా తల్లియే కావచ్చును. అయినను పుణ్యాత్మురాలయిన యీ మేకయే నన్ను జిన్నప్పటినుండియు పుత్త్రప్రేమతో బెంచుచుండుట

చేత దీనినే నేను తల్లినిగా భావించుకొనుచున్నాను. ఈ మేక తన కన్న బిడ్డల కయిన గొంచెముపాలు తక్కువచేసి నాకేలోపమును గలుగకుండ పాలిచ్చి పెంచుచున్నది. కాబట్టి, యిట్టి పుత్రవాత్సల్యముతో నన్నుగాపాడుచున్న యీ మేక యొద్దనే నేనుండి, దీనికే మాతృభక్తిని జూపెదను" అని యా గొఱ్ఱెపిల్ల మాఱు పలికెను.

గీ. బాగుగా దమసుతుల గా పాడనట్టి
వారు లోకంబులో బహుప్రాయ లెపుడు;
విద్యయును బుద్ధి చెప్పించి పెంచువారి
యెడ కృతజ్ఞులై బాలురు నడవవలయు.

● ● ● ● ● ● ● ● ● ● ●

8. కాకి, నక్క

యెక్కడనుండియో కాకి యొక మాంసఖండమును నోర కఱచుకొని వచ్చి చెట్టుకొమ్మమీద కూరుచుండగా నక్క చూచి, యేలాగునైన దా నా మాంసము నపహరింప వలెనని మెల్లగా చెట్టుక్రిందికి వచ్చి, కాకిని పిలిచి "అన్నా ! నీ సౌందర్య మే మని చెప్పను ! నీ దేహముయొక్క నీలమేఘ చ్ఛాయయేమి ! చక్రములవంటి కన్నుల యందమేమి! వింజామరలవంటి నీరెక్కల సొగసేమి ! హంసవంటి నీ నడక యేమి ! ఆహా ! ఏమి నా భాగ్యము ! నీ రూపము చూచినకొలదిని నాకు నేత్రోత్సవ మగుచున్నది ! ఒక్క చక్కదమే కాదు. భూమిమీద నీతో సరిగా మధురరుతముచేయు పక్షి సహితము మఱియొకటి లేదు. నీ వొక్కసారి నీ గానామృతమును కూడవర్షించి నా చెవులపండువు చేసితివా, లోకములో నాయంతటి ధన్యు డుండడు" అని ముఖస్తుతి చేసెను. ఆ పొగడ్త కుబ్బిపోయి, దేహము పరవశము కాగా, కాకి తన సంగీతమును గూడ వినిపించి శాశ్వతకీర్తిని సంపాదింపవలెనని యెంచి నోరు తెఱచి కావు కావుమని కూసెను. కాకి నోరు తెఱవగానే మాంసము క్రిందపడినందున నక్క చటుక్కున దానిని నోట కఱచుకొని "ఓసి పిచ్చిదానా ! నీ వింతసేపును విన్నూరకే పొగడితి ననుకొన్నావా ? నావచ్చినపని నాకయినది గనుక, ఇక నీపాట నీవే యుంచుకో. నీవంటి కురూపిని స్వలాభము లేక యెవ్వరు స్తుతింతురు?" అని తనదారిని పోయెను.

గీ. వసుధలోపల నరులను బాడుచేయు
స్తోత్రపాఠుల మించు శత్రువులు లేరు;
లాభ మొంద ముఖస్తుతు ల్పలుకువారి
వలల దగులక కనుగల్గి మెలగవలయు.

• • • • • • • • • •

9. నెమలిని పక్షిరాజునుగా జేయగోరుట

పూర్వకాలమునం దొకసారి తమకు రాజు నేర్పఱుచు కొనుటకయి పక్షులన్నియు నొకచోట సభచేసి యెవరిని రాజునుగా నేర్పఱుచు కొందుమా యని యాలోచించుకొనుచుండెను. అప్పుడనేక పక్షులు వచ్చి పక్షి రాజ్యాధిపత్యమునుకు తామే యర్హులమని బయలు దేఱి తమతమ సామర్థ్యములను సభవారితో జెప్పుకొనసాగెను. అప్పుడు నెమలి వారివద్ద నిలిచి తన సౌందర్యమును వారికిజూపి, చిత్రవర్ణముగల పురి విప్పి వారియెదుట మనోహరముగా నృత్యము చేసి తన నాట్యకౌశలమును గనబఱిచి, పక్షి రాజ్యమునకుదన్ను పట్టము కట్టవలసినదని వారిప్రార్థించెను. ఆ వన్నెలును జూచి భ్రమించి విశేషసంఖ్యగలపక్షులు పక్షి రాజ్యమును నెమలికే యీయవలసినదని నిర్ధారణము చేసెను. అంతటి మంచిరాజు తమకు లభించినందలకయి పరమానందమునొంది పక్షులన్నియు ఱెక్కలెగురవైచుచు రాజ్యాభి

షేకమహోత్సవమునకయి ప్రయత్నించుచుండగా, ఆ గుంపులో నుండి చిలుక యొక్కటి పైకి వచ్చి స్వభావ మనోహరమయిన తన సుస్వరముతో సభవారినుద్దేశించి యిట్లనియెను. 'మీరందఱును జేరి యసమాన సౌందర్యము గల మయూరమును పక్షి రాజ్యాధిపతినిగా జేయ నిశ్చయించినందులకు నాకెంతో సంతోషముగా నున్నది. ఐనను నా మనస్సు నొక్క సందేహము మాత్రము బాధించుచున్నది. మనమిప్పుడీ నెమలిని రాజునుగా నేర్పఱచుకొని మన ధనప్రాణముల నీతని యధీనము చేయుచున్నాము. రాజువలన గలుగవలసిన ముఖ్యఫలము ప్రజల రక్షణము గదా ? ప్రజారక్షణము చేయలేని రాజుండుటవలన నేమియు ప్రయోజనములేదు. రేపటినుండి డేగలు గృధ్రములు మొదలయిన క్రూరపక్షులు మనమీద దాడి వెడలి మనలను సంహరించి భక్షింప మొదలు పెట్టినప్పుడు తా నడ్డపడి మన ప్రాణములు కాపాడగలుగు నేమో యీ రాజు నడిగి మఱి పట్టాభిషేకమహోత్సవము నడపవలెనని నా ప్రార్థన." ఆ మాటలు విని పక్షులన్నియు నొండొరుల మొగములు చూడ మొదలు పెట్టెను. నెమలియు దగిన ప్రత్యుత్తరమును జెప్పజాలక క్రిందు జూచుచు నూరకుండెను. అంతట పక్షు లన్నియు తెలివితెచ్చుకొని నెమలికి పక్షి రాజ్యమిచ్చుట మానుకొనెను.

గీ. శక్తి చూడక బాహ్యవేషముల భ్రమసి
నరుల గైరవార్హుల గా గ బరిగణింత్రు;
కోటిపామరు లాడెడుమాటకన్న
దెలివిగల మర్త్యు డొక డాడుపలుకు లెస్స.

• • • • • • • • •

10. ఏదుబందిృ పాములు

ఒక గుహలో పాము లనేకములు వసించుచుండగా ఏదుబంది యొకటి యక్కడకు వచ్చి తాను విశ్రాంతి పొందుటకు కొంచెము తావిండని వేడుకొనెను. ఆ పాములు కొంచెమొత్తిగిలి యిక్కడ నుండుమని దాని కొకమూల కొంచెము చోటిచ్చెను. ఆ యేదుబంది లోపల ప్రవేశించినతరువాత మెల్లమెల్లగా లోపలికి జరిగి పాములమీదికి రా నారంభించెను. ఏదుపందిముండ్లు గ్రుచ్చుకొన మొదలు పెట్టినందున సహింపలేక యా పాములు దాని నావలికి పొమ్మని యడిగెను. అప్పుడా యేదుపంది పాములను లక్ష్యముచేయక యాగుమలో తన కేమియు నిబ్బందిలేక సుఖముగానే యున్నదనియు, ఎవ్వరికిబ్బందిగా నున్నదో వారే గుహను విడిచి మఱియొకచోటు చూచికొనుట యుచితముగా నుండననియు చెప్పి ముండ్లుగ్రుచ్చుకొనునట్లుగా మఱింతమీదికి జరగసాగెను. అప్పుడాపాములు మొట్టమొదట దానికి తావిచ్చినందలకు పరితాప పడవలసి వచ్చెను.

గీ. నరులు బతిమాలుకొని తొల్తనారుల చెంత
జేరి పిదప వారికె కీడు చేయు చుంద్రు;
కావునను బుద్ధిమంతులు కన్ను గలిగి
దుష్టులను జెంత జేర్చక తొలగ వలయు.

• • • • • • • • • •

11. దుర్మార్గపు కప్ప

ఒకనాడొక యెలుక యొక యేటిని దాటుటకయి యాలోచించుచు గట్టున కూరుచుండియుండెను. అప్పుడొక కప్ప నీటిలో నుండి పయికి వచ్చి, ఎలుకను వచ్చిన కార్యమడిగి తెలిసికొని దానిని



మోసము చేయవలెనని నిశ్చయించుకొని, "ఓ యెలుకబావా ! నీవు కాలికొకదారము కట్టుకొని యాదారపుగొనను నా మొలకు గట్టిగా కట్టివేసినయెడల నీ వీదవలసిన యాయాస మక్కఱలేకుండ నేను నిన్నావలిదరికి సులభముగా జేర్చెదను" అని చెప్పెను. ఆ మాటల కెలుక సంతోషించి యొప్పుకొని చెప్పినట్లుచేసి నీటిలో ప్రవేశించెను. కప్ప దానిని కొంచెము దూర మీడ్చుకొని పోయి లోతునీట ప్రవేశించిన తరువాత తా నడుగుననకు మునిగి దానిని ముంచనారంభించెను. అది చూచి యెలుక "ఓ కప్పబావా ! నన్ను ముంచి వేయుచున్నా వేమి అని యడిగెను "ఓ బుద్ధిహీనుడా ! నాచేత బలి చేయించుకో సాహసించినందుకు నిన్ను ముంచివేసి మీ మూషకజాతి కెల్లను బుద్ధివచ్చునట్లు చేసెదను. చేతనయిన పక్షమున నీ ప్రాణములు కాపాడు కొమ్ము" అని మఱింత వడిగా నీటియడుగునకు లాగ మొదలు పెట్టెను. అప్పు డాకాశమున నెగురుచున్న డేగ యొకటి నీటిపై కొట్టుకొనుచున్న యా యెలుకను జూచి దానిని కాలితో

తన్నుకొని పయికెగిరెను. డేగయొక్క కాలిఁవ్రేళ్ళ సందున నిఱుకు కొన్న యెలుక కాలి దారముతోడ గూడ కప్పయు వ్రేలాడుచు పయికి లేచి వచ్చెను. అది చూచి యద్భుతపడి డేగ కప్పను జూచి "మండూక రాజా ! మీరేల దయచేసినారు" అని యడిగెను. నావిధి నన్నిక్కడకు దీసికొనివచ్చినది. నేనీ యెలుకను నీటిలో ముంచి చంపవలెనని యత్నించి; ఇప్పుడు నీటిపయికి వచ్చను నేనే చచ్చుచున్నా" అని కప్ప యుత్తరము చెప్పెను. 'నీవు చేసిన మోసమునకయి నిన్ను మాత్రమే చంపి భక్షించెద నని చెప్పి యా డేగ దానిని ముక్కుతో పొడిచి చంపుకొని తినెను.

గీ. అన్యులను మోసపుచ్చంగ నరయువారు
తామె మోసపోవుదు రెందు ధరణిలోన ;
పరులకును గీడు రోసెడువారలకును
మేలు చేయునె దైవంబు మేర మీఱి ?

• • • • • • • • •

12. బంగారు గ్రుడ్లు పెట్టు బాతు

ఒక మనుష్యునియొద్ద నొక బాతుండెను. అది ప్రతిదినమును ఒక బంగారుగ్రుడ్డు పెట్టుచుండును. వాడు దానితో తృప్తిపొందక యత్యాశ గలవాడయి ఒకనా డొంటిగా తనలో తా నాలోచించి దాని కడుపులోనున్న బంగారు గ్రుడ్ల నన్నిటిని నొక్క సారిగా దీసికొని భాగ్యవంతుడు కావలెనని నిశ్చయించి, కత్తి తీసికొనివచ్చి దాని కడుపు కోసెను. దానికిడుపు పరీక్షించి చూడగా నాకడుపులో నొక గ్రుడ్డును లేకపోయెను. అప్పుడు వాడు తనబాతును నిష్కారణముగా చంపుకొన్నందునకు మిక్కిలి ఖేదపడి, మునుపు ప్రతిదినమును వచ్చుచుండెడు గ్రుడ్లుకూడ పోయెనుగదా యని పరితాపపడ మొదలుపెట్టెను.



గీ. లోకమున దురాశ గొని యనేక మనుజు
లరయ కవివేక కార్యంబు లాచరించి
మున్ను గలదానిగూడ గోల్పోయి యవల
గ్రొత్తయాపదలను దెచ్చుకొందు రకట !

• • • • • • • • • •

13. తెలివిమాలిన దుప్పి

ఒకనాడొక దుప్పి వేసవికాలములో మధ్యాహ్న వేళను చెఱువులో నీరు త్రాగుచు, తేటనీటిలో తనరూపమును జూచుకొని కొమ్ముల యొక్క సౌందర్యమునకు మిక్కిలి యాశ్చర్యపడి నీటిలో నిలుచుండి యిట్లాలోచించుచుండెను "ఆహా ! అనేక శాఖలతో గూడి యీ కొమ్ములెంత యాశ్చర్యకరముగా నున్నవి ! ఇటువంటి చక్కనికొమ్ము లున్నందులకు భగవంతుడు నాకీగడకఱ్ఱలవంటి ఊచకాళును బెట్టక

పొట్టికాళ్ళను బెట్టి యున్న పక్షమున నావంటి చక్కని జంతువు లోకములో మఱియొకటి యుండునా ? అవివేకియైన దేవుడు నాకీ లోపమును గలుగజేసినాఁడు అని యాలోచించుచుండగా, వేటగాడొకడును కొన్ని వేటకుక్కలును దుప్పికి నేత్రగోచరము లయ్యెను. ఆ దుప్పి కుక్కలను జూచి భయపడి నీరు వెడలివచ్చి కాళ్ళుజాడించి వాయువేగమున నరణ్యములోనికి పరుగెతి నిమిషములో నదృశ్యమయ్యెను. కాని యడవిలో బరుగెత్తుచుండగా కొమ్ములు చెట్ల కొమ్మలలోను తీగెలలోను తగులుకొని పరుగెత్తలేక కుక్కలచేత పట్టుకోబడి దుప్పి ప్రాణములు విడుచుచు మరల నిట్లు చింతించెను "అయ్యో ! నేను పనికిమాలిన వనుకొన్న కాళ్ళే నా ప్రాణము రక్షించి క్షణకాలములో నన్నింతదూరము తెచ్చినవి ; ఇంతలో నేనెంతో మెచ్చుకొన్న నాకొమ్ము లడ్డమువచ్చి నన్నిక్కడ నిలుపకపోయినపక్షమున కాళ్ళసాహాయ్యమున నేను బ్రతికిపోదును" అనుకొనుచు ప్రాణములు విడిచెను.

గీ. బుద్ధిహీనులు కొంద ఱీ పుడమియందు
నీశ్వరునిబుద్ధిమహిమంబు నెఱుగలేక
ఘనుల మనుకొంచు నీశ్వరాజ్ఞలను మీఱి
దేవు నవహసించుచు గీడు తెచ్చుకొంద్రు.

• • • • • • • • • •

14. కప్పలు రాజును గోరుకొనుట

చెఱువులలోను, గుంటలలోను విచ్చలవిడిగా తిరుగుచు సుఖముగా నుండి యొకనాడు కప్పలన్నియు నొక చెఱువువద్ద జేరి యఱచుచు సభచేసి తమకురాజు కావలెనని యింద్రుని ప్రార్థించెను. ఇంద్రుడు వాని ప్రార్థన విని పైనుండి యొక దుంగను చెఱువునడుమను గుభిల్లున నీటిలో పడవేసి, అదియే మీ రాజని చెప్పెను. అంత యెత్తునుండి పడినప్పుడు పయికి లేచిననీరు చూచి తమరాజెంత బలవంతుడో యని భయపడి కప్పలు మొట్టమొదట సమీపనకు

బోవుటకే జడియుచు భయభక్తులు కలిగియుండెను. కాని యటు తరువాత తమరాజు కదల మెదలక యొకచోటనే యుండుట చూచి కొంత భయము తీఱి కప్పలు మెల్ల మెల్లగా సాహసించి దాని సమీపమునకు బోసాగెను. అప్పుడును తమరాజు కదలమెదలకుండుట చూచి యందొకటి దానిని పరమసాధువునుగా భావించి తాకిచూచెను; మఱియొక కప్ప దానిని తాకినను భయము లేదనుకొని మీదికి దుమికెను. అటుతరువాత నొకటొకటే కప్పలన్నియు దానిమీద నెక్కి నిర్భయముగా నాట లాడసాగెను. ఈ ప్రకారముగా గొన్నిదినములు జరిగినతరువాత తమ కింద్రుడు మంచిరాజు నీయనందున కత్రుప్తికలవయి, కప్పలు మరల సభచేసి తొంటికంటె ద్విగుణముగా నఱచుచు దమకు దుంగరాజు పనికరాలేదనియు జుఱుకుదనముగల రాజును ప్రసాదింపవలయు ననియు తమరొద లాకాశ మంటునట్లు మరల నింద్రుని బ్రార్థించెను. అప్పుడింద్రుడు తఱుచుగా దనకు తొందర కలుగజేయుచున్నందునకయి వానిమీద కోపము వహించి వానికి రాజునుగా నొక కొంగరాజును బంపెను. ఆ బకేంద్రుడు తనకు రాజ్యము రాగానే యపరిమితసంతోషముతో వచ్చి ప్రజలమీదబడి కావలసినన్ని కప్పలను యథేచ్ఛముగా ప్రతిదినమును భక్షింపసాగెను. అట్లు తమమొఱ్ఱునాలింపక దొరకినవాని నన్నింటిని పట్టి భక్షించుచుండగా నానాటికి పలుచనయి తమరాజున కగపడకుండ మూలమూలల దాగుచు ఇంకను గొన్నాళ్ళీరాజే యున్నపక్షమున దమకు బ్రళయము సంభవించునని భయపడి, కప్పలన్నియు రహస్యముగా నొకచోట చేరి క్రూరుడయిన యా రాజును దీసివేసి వేఱొక రాజును ననుగ్రహింపవలయుననియు, లేని యెడల వెనుకటి రాజునే మరల ప్రసాదింపవలయు ననియు, బహువిధముల నింద్రుని బ్రార్థించెను. అప్పు డింద్రుడు వాని ప్రార్థనల నంగీకరింపక మీరు కోరి తెచ్చుకొన్న

రాజును తొలగింపగూడదనియు స్వయంకృతాపరాధఫలము ననుభవింప వలసినదని చెప్పి పంపివేసెను.

గీ. క్షితితలంబున దమమంచిస్థితివిగూర్చి
తృప్తినొంద కత్యాశ వహించి యెపుడు
జాల వ్యర్థప్రయత్నముల్ సలుపువారు
పెక్కుకష్టంబులను దెచ్చి పెట్టికొంద్రు.

• • • • • • • • •

15. తాబేలు, కుందేలు

ఒకనా డొక తాబేలు మెల్లగా ప్రాకుచుండగా జూచి కుందేలొకటి దానివద్దకువచ్చి దానినడకను పరిహసించెను. అందుమీద తాబేలు రోషము తెచ్చుకొని, పందెము వేసినయెడల నీతో సమానముగా నేనును పరుగెత్తగలనని కుందేటితో పలికెను. ఆ మాటలకు పకపక నవ్వి మంచదని కుందేలు పందెమున కొప్పుకొని, ఒక క్రోసు దూరములోనున్న మఱ్ఱి చెట్టువద్దకు పరుగెత్తవలెనని చెప్పెను. మంచిదని ప్రయాణమయి కూర్మము మెల్లగా కాళ్ళీడ్చుకొనుచు నడవనారంభించెను; చెవులపిల్లి వాయువేగమున బరుగెత్తి నిమిష కాలములో నరక్రోసుదూరముచేరి, వెనుక తిరిగిచూచి తాబేలించు మించుగా బయలు దేఱినచోటనే యుండుట కనిపెట్టి, అగివచ్చులోపల నింతలో నొకనిద్ర తీసి తరువాత పరుగెత్తవచ్చునని యొక చెట్టు నీడను పరుండి సుఖముగా నిద్రపోయెను. కుందే లీప్రకారముగా గాఢ నిద్ర పోవుచుండగా తాబేలు విడువక మెల్లగా నడిచి సంకేతస్థలమును జేరి పందెమును గెలిచెను. కుందే లంతట మేల్కొని యులికిపడి లేచి తొందరగా పరుగెత్తెనుగాని యాలోపలనే కార్యము మించెను.

గీ. నడుమ విడువక పని నల్ల నడపువారె
కార్యసిద్ధిని గాంతురు గాని, మంచి
తఱిని విశ్రమించి తరువాత తమకపడుచు
బరుగు లిడువారు ఫలసిద్ధి బడయ రెపుడు.

• • • • • • • • • • • •

16. పులి, నక్క

వింటివిద్యయందు మిక్కిలి నేర్పరియైన వేటకాడొకడరణ్యమునందు బ్రవేశించి బాణములు పఱపి వేటాడమొదలు పెట్టగా మృగములన్నియు నభయపడి నానాముఖముల పరుగెత్తజొచ్చెను. అప్పుడొక్క పెద్దపులి వానిముందు నిలిచి భయపడి పాఱిపోవలదని మృగములకు ధైర్యము చెప్పి, యన్యసాహాయ్య మక్కఱలేక తానే యా వేటకాని నెదిరించి పాఱదోలి మృగములను రక్షించెదనని వాని కభయహస్తమిచ్చెను. ఈ

మాటలు పులి పలుకుచుండగానే యింతలో వేటకాడు చెట్టుమీదినుండి గురిచూచి పులియొక్క వెన్నున నాటునట్లుగా నొక వాడిబాణమును విడిచెను. ఆ బాణము వెన్నున నాటినతోడనే పులి వేదనకు సహింపలేక నోరు తెఱచి పండ్లుపయికి బెట్టి మూలుగసాగెను. అప్పుడొక నక్క ముందునకు వచ్చి వ్యాఘ్రమును జూచి "వేటకానిని శిక్షించి మృగములను రక్షింప దీక్ష వహించిన దేవరవారి నిట్లు నొప్పించిన హీనుడెవ్వడు." అని ప్రశ్న వేసెను. "నేను భ్రాంతిపడినాను. మృత్యుదేవతవలె జెట్టుమీద గూరుచుండి బాణములు విడుచుచున్న యావేటకా." డు అని పులి యుత్తర మిచ్చెను.

గీ. కండబల మెంత యున్నను గండడంచు
బుద్ధిబల మెక్కుడుగగల్గు పురుషనరుడు
దేహబలమునకంటెను ధీబలంబె
శ్రేష్ఠతర మెల్ల గతుల దర్శించి చూడ.

• • • • • • • • • •

17. ఆబోతులు, సింహము

నాలు గాబోతు లొకపొలములో మిక్కిలి మైత్రికలవై యొండొంటి నెప్పుడు నెడబాయక యొక్క చోటనే మేయుచు నొక చెట్టునీడనే శయనించుచు నత్యంతైకమత్యముతో విహరించుచుండెను. ఆ బలిసిన వృషభములను జూచి యొకసింహము నోటియూటలు ద్రావుచు వాని నేలాగుననైనదన కడుపులో వేసికొనవలెనని చిరకాలమునుండి కోరుచుండెను. కాని వానియైకమత్యమును జూచి భయపడి, వానిలో బ్రత్యేకముగా నొక్కొక్కదానిమీదబడి సంహరించుటకు దనకు శక్తి కలిగియున్నను నాలిగింటితో నొక్క సారిగా బోరాడుటకు శక్తి

చాలనిదయి యా సింహము వారిదాపునకు బోవుటకు సాహసింపకుండెను. అయినను సింహ మంతటితో నిరాశచేసికొని యూరకుండక, యీయైకమత్య మున్నంతవఱకు వానిని సాధించుట యసాధ్యమని మెఱిగినదయి యేయుపాయముచేతనైన వాని యైకమత్యమునకు భంగము కలిగించి వానిని వేఱుచేసి తన మనోరథము నీడేర్చుకొనవలెనని నిశ్చయించుకొనెను. అట్లు నిశ్చయము చేసికొని సింహ మప్పటినుండియు పని కారంభించి, యొకదానికి దెలియకుండ నొకదానిచెవిలో నితరవృషభములమీద కొండెములు చెప్పుచు గొంతకాలమునకు వాని మనస్సులలో నన్యోన్యద్వేషమును బరస్పరాసూయము నంకురించునట్టు చేసెను. అది కనిపెట్టి సింహము సమయముచూచి ప్రతిదినమును వాని చెంతజేరి యిచ్చకపుమాటలు చెప్పి వాని మనస్సులలో నుదయించిన ద్వేషాగ్నిని రగులుకొలుపుచుండగా, కొంతకాలమునకు వృషభములు తొంటియైకమత్యమును బోగొట్టుకొని యొండొంటి యుత్కర్షమున కసూయపడుచు దూరదూరముల దొలగుచు తుదకొండొంటి నెడబాసి యొంటిగా దిరుగసాగెను. అప్పుడు తన మనోరథము సఫలమయినందుకు సంతోషించి సింహము వేఱువేఱు వానిమీద బడి యొకదానితరువాత నొకదానినిగా చంపి వాని మాంసముతో నాప్యాయనముగా విందారగించెను.

గీ. అరసి చూడంగ నైకమత్యంబులోడ
నుర్వి సరిపుచ్చుబలము వేఱొకటిలేదు
ధర నసూయచే నైకమత్యంబు విడుచు
జనులు సుఖసాధ్యు లగుదురు శత్రువులకు.

• • • • • • • • •

18. గొఱ్ఱెపిల్ల, తోడేలు

ఒకనాడొక గొఱ్ఱెపిల్లయు తోడేలును ఏకకాలమునందు దాహము తీర్చుకొనుటకయి యొక యేటియొద్దనకు వచ్చుట తటస్థించెను. ప్రవాహమునకు పై భాగమున గొంత దూరములో తోడేలును క్రింది భాగమున గొంతదూరములో గొఱ్ఱెపిల్లయు నీరు త్రాగుచుండెను. అప్పుడు తోడేలా గొఱ్ఱెపిల్లను జూచి దానితో కలహము పెట్టుకొనదలచి కోపదృష్టితో "పానమునకు పనికిరాకుండ నేను ద్రాగుచున్న నీ రిట్లేల కలచిపాడు చేయుచున్నావు" అని యడిగెను. ఆ మాటలకు భయపడి గొఱ్ఱెపిల్ల "స్వామీ ! మీరు ప్రవాహమునకు పైని జలపానము చేయుచున్నారు. నేను ప్రవాహమునకు దిగువను దూరముగా నీరు త్రాగుచున్నాను. కాబట్టి నామూలమున ప్రవాహము పైనీరు కలగుట సంభవింప"దు అని మహావినయముతో మనవిచేసెను. "ఇది యటుండ నిమ్ము. ఆఱుమాసముల క్రిందట నన్ను నీవు చాటున దిట్టినాట.

ఎందులకు దిట్టినావు అని కన్నులెఱ్ఱచేసి తోడేలు కేకవేసెను. "అయ్యా ! ఆఱుమాసముల క్రిందట నేను పుట్టనేలేదు. తమ్మెట్లు దూషించినది నేనుగా"ను అని గొఱ్ఱెపిల్ల మరల నమ్రతతో విన్నవించెను. అందుమీద తోడేలు దానితో వాదులాడుటవలన గార్యములేదని యెఱిగి మఱింతకోపము తెచ్చుకొని పటపట పండ్లు కొఱుకుచు "నన్ను తిట్టినది నీవు కాకపోయినయెడల నీ తండ్రి అయియుండును. ఎవరు చేసినను నేరమొకటే" అని పలికి గొఱ్ఱెపిల్లమీదబడి దానిని చంపి భక్షించెను.

గీ. దుష్టు లగువారు పరులకు దొసగు చేయ
గారణం బేదొ కల్పింత్రు కలహములకు;
కావునను బుద్ధిమంతులు తా వెఱింగి
దుష్టులకును దూరంబుగా దొలగవలయు.

• • • • • • • • •

19. ఎద్దులు, బండిచక్రములు



సరకులతోను జనులతోను నిండియున్న బరువుబండి నొక దానిని బలమయిన యెద్దులు రెండు లాగుకొనిపోవు చుండగా వెనుకవైపునుండి చెవులు గిపెట్టునట్టుగా బండిచక్రములు కిఱ్ఱుకిఱ్ఱుమని ధ్వని చేయసాగెను. అప్పుడా వృషభములు వెనుక దిరిగిచూచి "యింత బరువును వహించి మాటాడక బండి యీడ్చుకొని మేము పోవుచుండగా, ఊరక మీ రఱచెదరేమి?" అని చక్రముల నడిగెను.

గీ. కష్టపడునట్టివారు లోకంబులోడ
మొఱ్ఱ పెట్టరు తమకష్టములను గూర్చి ;
పట్టివారలె యఱతురు మిట్టిపడుచు
గొడ్డుగేదెల కఱపులు గొప్ప కావె ?

● ● ● ● ● ● ● ● ● ●

20. తోడేలు, కొంగ



తోడేలొకటి మేకను జంపి భక్షించుచుండగా దాని యెముక యొకటి గొంతుకలో గ్రుచ్చుకొని నొప్పి కలిగింపజొచ్చెను. అది యూడదీసికొన శక్తి లేక బాధపడుచు మూల్గుచు తోడేలు దారిని బోవువారి నెల్ల జూచి తనయాపద తొలగించినయెడ గొప్ప యుపకారము చేసెదనని ఘోషించుచు వచ్చెను. ఆ మొఱ్ఱ విని జాలిపడి దగ్గఱకుబోయి గొప్ప బహుమానము దొరకునన్న యాశచేత నొక కొంగ తన మెడతోడేలు గొంతుకలో దూర్చి యెముక నూడబెఱికి తనకిచ్చెదనన్న బహుమాన మిమ్మని యడిగెను. అప్పుడు తోడేలా కొంగను జూచి "నీకు బుద్ధి లేనట్టున్నది ! నీవు నా నోటిలో తల పెట్టినప్పుడు కసుక్కున కొఱుకక దయ తలచి విడిచిపెట్ట లేదా ? నీ కింతకంటె నేమి యుపకారము కావలెను ? నీ వింకను తృప్తి నొందక సిగ్గులేక బహుమానము కావలె ననుచున్నావా ? ఇంక మాఱుమాటాడక దూరముగా దొలగిపో " అని సాగనంపెను.

గీ. అల్పజనులకు నుపకార మాచరింప
నపకృతి యొనర్పయె గొప్పకృప తలంప ;
పాములకు బ్రేమతోడను బాలుపోయ
గలుగు ఫలమెల్ల విషమె వర్ధిలుట కాదె ?

• • • • • • • • • • •

21. తెవులుగొంటు దుప్పి

పూర్వ మొకప్పు డొక దుప్పి రోగముచేత మేతకయి దూరము నడవలేక యొక పచ్చికబయల పరుండి మెల్ల మెల్లగా నడుచుచు, అందిన గడ్డిపఱకలు మేయుచుండెను. ఇంతలో దాని చుట్టములన్నియు ప్రతిదినమును దాని క్షేమమును విచారించుటకయి వచ్చుచు పోవుచు నుండి యక్కడ గడ్డియంతయు మేసిపోయెను. ఆ దుప్పి యందుచేత

మేత దొరకక రోగము వలనగాక బంధువుల యాదరమువలననే వస్తుపడి చచ్చి పోయెను.

గీ. వసుధలో బంధువర్గ మీ వరుసగానె
చూతుమని వచ్చి బాధింత్ర చుట్టములను ;
వారు చేయు సాయంబు దైవంబె యెఱుగు ;
పొడగు గృహస్థు వారి మేపంగ లేక.

● ● ● ● ● ● ● ● ● ●

22. వేటకాడు, పావురము

వేటకా డొకడు పిట్టల వేటకయి యరణ్యమునకు బోయి యక చెట్టుకొమ్మమీద పావుర మొకటి కూరుచుండి యుండగా జూచి దానిని చంపుటకయి గుఱిచూచి బాణము వేయబోవుచుండెను. ఆ తొందరలో వాడు గుఱి కుదుర్చు కొనుటకయి వెనుక వెనుకకు జరుగుచు క్రింద జూడక యొక త్రాచుపాముమీద నడుగు వేసినందున, ఆ కృష్ణసర్పము వానికా లొడిసి కఱచెను. అప్పుడు వాడు గుఱి తప్పిపోగా విల్లు జాఱవిడిచి విషబాధచేత క్రిందబడి, తా నొక సాధు జంతువు ప్రాణము గొన దలచినందుకు శిక్షగా తన ప్రాణమునకే భంగము వచ్చినదని విలపించుచు ప్రాణములు విడిచెను.

గీ. క్రూరులై యన్యులకును విష్కారణముగ
ప్రాణహాని జేయగ యత్నపడెడివారు
తీఱని విపత్తులను దామె తెచ్చుకొనుచు
దుఃఖపడుదు రావల నాత్మదోషమునకు.

● ● ● ● ● ● ● ● ● ● ●

23. జ్యోతిష్కుడు, మార్గస్థుడు

ఇద్దరు బాటసారు లొకనాటి రాత్రి వెన్నెలలో ప్రయాణము చేయుచుండగా, వారిలో నొకడు జ్యోతిష్కు డయినందున మఱునాడు తన కార్యము గ్రహగతినిబట్టి యెట్లు నడుచునో చూడవలయు ననియాకాశమున నక్షత్రములవంక జూచి ప్రశ్నమడచి లెక్కించుచు నడిచి క్రిందుచూడక దబాలున గోతిలో గూలి కాలికి దెబ్బ తగిలించుకొనెను. అప్పుడు తోడి పాంథు డా జ్యోతిష్కుని గోతిలో నుండి లేవదీసి గాయమునకు కట్టుగట్టి "మిత్రుడా ! ఇప్పుడు సంప్రాప్తమయిన యీ దురవస్థనుబట్టి ఇకముందయిన జ్ఞానము తెచ్చుకొని యాకాశము నందు గ్రహములగతిని గ్రహములకు విడిచి పెట్టి భూమిమీద నీ గతిని నీవు చూచుకొనుటను నేర్చుకొ"ము అని బుద్ధి చెప్పెను.

గీ. జనుడు తన బాగుకొఱకు నక్షత్రములను
గ్రహములను నమ్మి వానికై కాచుకొనక,
శక్తివంచన లేకుండ శ్రమము పడుచు
దనప్రయత్నంబునే నమ్ముకొనగవలయు.

● ● ● ● ● ● ● ● ● ● ●

24. తాబేలు, గరుడపక్షి

తాబే లొకటి భూమి మీద నొకకొలనిలో చిరకాలము వాసముచేసి విసుగుచెంది, ఆకాశమున విహరించి యచ్చటి వింతలను జూడవలె నన్నకోరిక గలదయి, కన్నవారిని బిలిచి తన్నెవరయిన గగనమార్గమున గొనిపోయి ప్రపంచమెల్ల జూపినయెడల భూమిలో నొకచోట ననర్ఘరత్నములతో నిండి యున్న నిక్షేపమును జూపెదనని



చెప్పఁజొచ్చెను. వాగ్దానమును నమ్మి సంతోషించి యొక గరుడపక్షి యా కూర్మమును ఖేచరమార్గమున ద్రిప్పి సమస్తమును జూపెదనని యొప్పుకొని, దానిని మేఘమండలమువఱకును గొనిపోయి చూపి, నీవు చూచెదనన్న రత్ననిధి యెక్కడనున్నదని యడిగెను. అది రత్నములున్న స్థలమును జెప్పలేక నీళ్ళు నములుచు నూరకుండగా గరుత్మంతుడు కూర్మము తన్ను మోసము చేసినదని గ్రహించి తన కాళ్ళపట్టు విడిచి మేఘములలోనుండి దానినొక పర్వతముమీద గూలవిడిచెను. ఆపాటుచేత కూర్మము సంధులు పగిలి చావగా, గరుడుడు దిగివచ్చి దాని మాంసమాప్యాయనముగా భక్షించి తనదారిని బోయెను.

గీ. చేతగాని వాగ్దానముల చేయరాదు ;
చేసె నేనియు దప్పక చేటు మూడు,
వట్టియాశల నూరక పెట్టునేని.
దనకు బరులకుగూడ ఖేదంబు గలుగు.

● ● ● ● ● ● ● ● ● ●

25. కప్ప, నక్క

ఒక కప్ప చెరువులోనుండి పయికి దుమికివచ్చి గట్టు మీద గూరుచుండి, చుట్టుపట్లనున్న మృగములతో దాను ఘనవైద్యుఁడ ననియు, సమస్తరోగములను కుదర్పఁగల ననియు ఘోషించెను. బడబడలాడుచు పిడుగువానవలె గురిపించిన యా శబ్దాడంబరమున కాశ్చర్యపడి, యా ప్రసంగము యొక్క యర్థమేమియు దమకు దెలియకపోయినను చుట్టుపట్ల జంతువులు ఆ మండూకరాజుయొక్క పాండిత్యమును మెచ్చుకొని యాతని ప్రతిజ్ఞలను సంతోషింప జొచ్చెను. ఇట్లుండ నా గుంపులోనుండి యొకనక్క ముందునకువచ్చి తిరస్కారముతో "నీ గింగురుగొంతుకయు, నీ చప్పిడి దౌడలును, నీ మేని పొడల వ్యాధియు బాగుచేసికోలేని నీ వితరుల వ్యాధుల నెట్లు కుదుర్ప నేర్తువు?" అని యడిగెను. ఆ మాటలు విని మృగములన్నియు దూరముగా దొలగిపోయెను.

గీ. పరుల లోపంబులను జక్కబఱుతు ననెడు
వాడు తీర్చుకోవలె స్వలోపముల దొలుత;
తన రోగంబునే మాన్పుకొనగలేని
వైద్యు డొరులరోగము లెట్లు బాగుచేయు?

26. గాడిద, ముండ్లపొద

పొలముకాపు పొకడు తనపొలములో నానా విధములైన ధాన్యములను మూటలుకట్టి యొక గాడిదమీద వేసి యింటికి మోయించుకొని పోవుచుండగా, ఆ గాడిద త్రోవలో ముండ్లపొద నొకదానిని జూచి



యాకలిగొని యుండుటచేత దానియొద్దకు పరుగెత్తి యాకులు కొఱికి తినుచు, "నాకు పనికిరాక పోయినను నే నిప్పుడు మోసికొని పోవుచున్న యీ ధాన్యములో రుచ్యములయిన విందులు గుడిచి యెందఱో యానందింప దలచుకొని యుందురు. వీనితో జేసిన యే పిండివంట కంటెను నా నోటి కీ ముండ్లపొదయే యెక్కువ రుచికరముగా నుండును" అని తనలో తా నాలోచించుకొన మొదలు పెట్టెను.

గీ. ఒక్కనికి మంచియన్నమై యుండునదియె
యన్యునకు నుర్విలో విష మగుచునుండు ;
కావునను, లోకమందు సుఖంబు కలుగు
వివిధ జనులకు వివిధ వస్తువులవలన.

● ● ● ● ● ● ● ● ● ● ●

27. భరతపక్షి దానిపిల్లలు

ఒక భరతక్షితాను పిల్లలు పుట్టినచేను పండికోతకు సిద్ధముకాగా తన పిల్లలకు ఱెక్కలువచ్చి గూటిలోనుండి యెగుర గలుగుటకు లోపలనే కోతగాండ్రువచ్చి పొలమెక్కడగోయుదురో యనుభయము చేత తాను మేత తెచ్చుటకయి వెళ్ళబోవునప్పుడు తన పిల్లలను బిలిచి తానులేని సమయమం దెవ్వ రేమనుకొందురో యా మాటలన్నియు శ్రద్ధతో విని తాను వచ్చినతరువాత దనతో జెప్పవలసినదని చెప్పిపోయెను. అది వెళ్ళి న తరువాత పొలము కా పక్కడకువచ్చి తన కొడుకుతో "పొలము పండి కోతకు సిద్ధమయినది. ఱేపటిదినము నీవుపోయి మన పొరుగువారిని చేను గోయుటకు సాయము రండని పిలువు" మని చెప్పెను. ఆ మాటలు విని తల్లి రాగానే చెప్పి పిల్లలు తమ్ము వెంటనే మరియొక చోటికి తీసికొని పొమ్మని యడుగగా "మీరు తొందర పడనక్కఱలేదు. పొలముకాపు పొరుగువారి తోడ్పాటు నమ్ముకొన్నందున ఱేపు కోత జరగదు" అని తల్లివానికి ధైర్యము చెప్పెను. మఱునాడు మేత నిమిత్తము పోవునప్పుడుకూడ తల్లి పిల్లలకు గతదినమున జెప్పినట్టే చెప్పిపోయెను. అటుపిమ్మట పొలము కా పక్కడకు వచ్చి వాగువారు వత్తురేమో యని కొంతసేపు కాచుకొనియుండి వా రెంతసేపటికి రాకపోగా కొడుకును జూచి "నమిక పొరుగువారిని నమ్ముకొన్న కార్యము లేదు. నీవీ సాయంకాలమే పోయి నీ పినతండ్రి మొదలయిన మన చుట్టములను ఱేపు తెల్లవారకమునుపే కోతకు తోడురండని చెప్పిరా" అని చెప్పిపోయెను. ఈ సంగతికూడ పిల్లలు రాగానే చెప్పి భయపడసాగెను. అప్పుడు తల్లి పిల్లల జడుపు తీర్చి "మీరు విన్నదింతే యయినపక్షమున మీరు భయపడవలసిన పనిలేదు. మఱియొకరి పనినిమిత్తమై చుట్టము లెప్పుడును పిలువగానే రారు. ఱేపటిదిన మేమిజరుగునో మీరు

శ్రద్ధతో విని నాకు చెప్పుడు." అని మఱునాడు మరల నెరతెచ్చుటకయి పోయెను. నాడు విన్నటివలెనే పొలముకాపు ప్రాతఃకాలముననే వచ్చి వేచియుండి యే వేళకును జుట్టములు వచ్చుజాడ కానక విసిగి కొడుకునుజూచి "మన మితరుల తోడ్పాటున కానపడకూడదు. రేపు నీవు వచ్చునపుడు మంచి కొడవండ్లు రెండు తీసికొనిరా. ఱేపు మన మిద్దరమే చేను గోత మొదలు పెట్టుదము అని చెప్పిపోయెను. ఆ మాటలు విని పిల్లలు మరల చెప్పగానే తల్లి "ఇక మన మిక్కడ నిలువ గూడదు. పొలముకాపు తాను సొంతముగా పనిచేసికోదలచినప్పుడు రాకమానడు. మనము శీఘ్రముగా పోవలెను" అని యప్పుడే తన పిల్లలను తీసికొని మఱియొక చోటికి బోయెను. అనుకొన్నట్లుగా మఱునాటి యుదయకాలముననే పొలము కాపును కొడుకును వచ్చి పొలము కోత మొదలు పెట్టిరి.

గీ. పనిని జక్కగ నొనరింప వలయునన్న
స్వయముగా దానె చేసికోవలయు నెపుడు ;
కార్యమును దానె చేసొకొ గలుగునేని,
పరుల సాహాయ్యమున కాశపడగదగదు.

● ● ● ● ● ● ● ● ● ● ●

28. జోస్యుడు

ఒకనాటి రాత్రి జోస్యుడొకడు రచ్చచావడిలో గూరుచుండి పురజనులను పోగుచేసి వారికి భావిఫలములను జెప్పుచుండెను. అత డా ప్రకారముగా వ్రేళ్లుమడచి లెక్కలు వేయుచు, ఆకాశమువంక జూచి నక్షత్రములను గణించుచు, మహోత్సాహముతో నూరి వారి యదృష్టముల నెల్ల జెప్పుచుండగా నా నడుమ నొకడు వచ్చి జ్యోతిష్కుని జూచి "స్వామీ ! మీ యింట దొంగలు పడినారు" అని

కేకవేసెను. ఆ కేక చెవిని బడగానే జ్యోస్యుడు తొందరపడిలేచి యూరివారి భాగ్యములను వదలివేసి తనభాగ్యమును జూచుకొనుటకయి యింటికేసి పరుగెత్తమొదలు పెట్టెను. అప్పుడా శుభవార్త తెచ్చిన మనుష్యుడు పరుగెత్తుచున్న జోస్యుని పిలిపి "అయ్యా ! ఇందఱి యదృష్టములను దెలిసికొన్న మహాను భావులకు మీకు మీ యదృష్ట మేల తెలియలేదు?" అని యందఱిముందఱ నడిగెను.

గీ. సర్వవిదుడైన దేవుడు జనులమేలు
కొఱ కనాగతము మఱుంగు పఱచియుండ,
బూటకపుమాటలగు మర్త్యకీటకములు
భావి నెఱిగింప గలరంట భ్రాంతికాదె ?

• • • • • • • • • •

29. ఎలుగుబంటి, సింహము, లేడి

ఒక లేడిని జంపి యది తనకే రావలెనని యొంటిగుబంటియు, తనకే రావలెనని సింహమును తగవులాడి, ఘోరయుద్ధముచేసి యలసి సొమ్మసిల్లి సింహభల్లూకములు రెండును క్రిందపడెను. అవి యట్టి కదలలేని యవస్థలో నుండగా నప్పుడాదారిలో బోవుచున్న నక్కయొకటి చూచి మెల్లగా సమీపమునకు వచ్చి యవి కదల మెదలలేకుండుట కనిపెట్టి యా లేడిని నోట గఱచుకొని నిర్భయముగా నడవసాగెను. ఆ చౌర్యమును దాపుననే యుండి కన్నుల మంటగా జూచుచుండియు నేమియు జేయజాలక సింహభల్లూకములు నిట్టూర్పులు పుచ్చుచు "ఇది యంతయు మనకు పరస్పర వివాదము వలన వచ్చిన లాభము. మనయిద్దఱిలో నొక్కరికిని దక్కకుండ నడుమ పాడునక్క యొకటి వచ్చి యీ లేడిని మనకన్నుల యెదటనే యీడ్చుకొని పోవుచున్నది" అనిఇ వాచారింపసాగెను.

గీ. తాము తనలోన నధికులు తగవు లాడ
నడుమ నల్పులు లాభంబు బడయు చుంద్రు,
పోరు నష్టియు మఱిమఱి పొందు లాభ
మనెడు లోకోక్తి మిగుల సత్యంబు గాదె ?

• • • • • • • • • • •

30. గ్రద్ద, నక్క

గ్రద్దయొకటి యొక చెట్టుకొమ్మను గూడు కట్టిపిల్లలను బెట్టి వానిమేతకయి యేదయిన జంతువు దొరుకునాయని క్రింద జూచుచుండగా, దూరమున నెండలో చలి కాచుకొనుచు నొకనక్కపిల్ల దానికంటబడెను. కంట బడుటయే తడవుగా గృధ్రము బాణవేగమున క్రిందికి దిగి వచ్చి మృత్యుదేవతవలె జంబుక శిశువును కాళ్ళతో తన్నుకొని పయికెగిరి పోవుచుండగా, ఇంతలో దానితల్లి వచ్చి కన్నులనీరు పెట్టుకొని తనబిడ్డప్రాణము రక్షింపవలసినదనియు, తా

నేక పుత్రశోకమును సహింపజాలననియు, బహువిధములయిన దీనాలాపములు పలికి గృధ్రమును వేడుకొనెను. గ్రద్ద తనగూడు చెట్టుచివర నున్నందున నక్క కందననియు, వేఱువిధముగా పగదీర్చుకొనుట దానికి సాధ్యము కాదనియు, తలచి దాని మొఱ్ఱ యాలింపక యనాదరము చేసి యా నక్కపిల్లను దన పిల్లలపొట్టను బెట్టుటకయి తిన్నగా తనగూటిలోనికి దీసికొనిపోయెను. అందుమీద నక్క మిక్కిలి కోపముతో పరుగెత్తుకొనిపోయి యా సమీపమున మార్గస్థులు కొందఱొకవృక్షము క్రింద వంట చేసికొనుచుండగా పొయిలోని బగబగ మండుచున్న కొఱకంచొక్కటి నోర గఱచుకొని వచ్చి పగసాధింపవలెనన్న యుద్దేశముతో గ్రద్దగూడు నెట్టిన చెట్టు మీదికో బ్రాకుచుండెను. మండుచున్న కొరవితో వచ్చి నక్క మొట్టమొదటి కొమ్మమీదికి దుమకగానే యగ్నిజ్వాలచేత తనకును తన కుటుంబమునకును అకాలప్రళయము వచ్చునని భయపడి గ్రద్ద మంచిమాటలు చెప్పి బతిమాలుకొని యప్పుడే నక్క పిల్లను నక్కకిచ్చి పంపి వేసెను.

గీ. పరులకును బాధ గలిగించువారలకును
నేడొ మఱునాడొ యెప్పుడో కీడు మూడు ;
క్షితి బ్రజాపీడకులు సురక్షితుల మంచు
బొంగుచున్నను దప్పక పొసగు జేటు.

• • • • • • • • • • •

31. నూతిలోబడ్డ నక్క

నక్క యొకటి ప్రమాదవశమున నూతిలో బడి గోళ్ళతో నూతియంచు పట్టుకొని పయికి చూచుచు నీటిమీద తేలియుండెను. ఇట్లుండగా గొంతసేపటి కక్కడ కొకతోడేలు వచ్చి పయినుండి నూతిలో తొంగిచూచెను. తోడేలును జూచి నక్క సంతోషించి "ఓ



మిత్రుడా ! నాపాలిటి భాగ్యదేవత సమయమునకు నిన్నిక్కడకు బంపినది. నీవు వెంటనే యొక త్రాడు నూతిలో వేసి నన్ను బైకిదీసి నా ప్రాణము రక్షించి పుణ్యము కట్టుకొమ్ము " అని దీనముగా వేడుకొనెను. నక్కకు సంభవించిన ఘోరవిపత్తునకు జాలిపడి తోడేలు "ఓ మిత్రుడా ! నీకు సంభవించిన యీ యాపద నాకు వచ్చినట్లు పరితపించుచున్నాను. బుద్ధిమంతుడవైన నీకిట్టివిపత్తెట్లు సంప్రాప్తమయినది?" అని యడిగెను. "మిత్రుడా ! నీకు నిజముగా నామీద ప్రేమయున్న పక్షమున జాలిపడుచు నుచుండక శీఘ్రముగా సాయము చేయుము. నేను నీటిలో మునిగా చావ బోవుచున్నప్పుడు జాలిచూపెడు పొడిమాటలవలన నా హృదయమున కూఱట గలుగ బోదు" అని నక్క పలికెను.

గీ. కరుణగల మిత్రు డైనది కానిదియును
గష్టకాలంబున నె సుమ్ము కానవచ్చు ;
కష్టవేళ బిల్వక వత్తు రిష్టసఖులు
పిలిచిననుగాని రాకుంద్రు కలిమివేళ.

32. వాయువు, సూర్యుడు

పూర్వ మొకప్పుడు తమ యిద్దఱిలో నెవ్వ డధికుడని వాయుదేవునకును సూర్యునకును వివాదము సంభవించెను. అప్పుడు వా రామార్గమున నొకబాటసారి బోవుచుండగా జూచి వానిపయి బట్టలు ముందుగా నెవ్వరు తీయించివేయ గలుగుదురో పరీక్షించి దానినిబట్టి తమతమ సామర్థ్య తారతమ్య విర్ణయమును చేసి కొనుటకు నిశ్చయించుకొనిరి. వాయువు ముందుగా తనబలమును చూపుట కొప్పుకొని సూర్యుడు మేఘములచాటునకు దొలగగా, వాయుదేవుడు పర్వతగుహలు మాఱుమ్రోయునట్లు మహాధ్వనితో బయలు దేఱి తనకు వానను గూడ తోడుపఱుచుకొనియు మార్గస్థుల మీదబడి చలిచేత వజవజ వడకునట్లుగా వీచుచు వానిమీద దనబలము వంతను జూపసాగెను. గాలి గట్టిగా కొట్టినకొలదిని వాడంతకంతకు శీతముచే నధికబాధ పడుచు పయిబట్టను దీసి వేయుటకు మాఱుగా మఱింత గట్టిగా కప్పుకొని నెత్తి మీద సహితము ముసుగు వేసికొన నారంభించెను. అంతట సూర్యుడు మెల్లగా మేఘమండలములోనుండి విశ్శబ్దముగా బయలువెడలి తన కిరణ ప్రసారముచేత చలినంతను తఱిమివైచి గాలివానపాలై యలసియున్న యా పాంథునిమీద వేడికిరణములు సూటిగా వఱచి యున్నముచే దేహమంతయు చెమ్మట పట్టునట్లు చేసెను. ఆ యెండ వేడిమికి వాడు బయల నిలువలేక యొక చెట్టునీడకు పరుగెత్తి తన పైబట్టతీసి క్రింద బడవైచెను.

గీ. మీదబడి తీవ్రభాషలు మిగుల బలికి
బలిమిమై బని చేయింప గలుగుకంటె
దూరముననుండి మేనంటి తూలనాడ
కెంతపనియైన వడిగ జేయింపవచ్చు.

● ● ● ● ● ● ● ● ● ● ●

33. సింహము, మృగములు

ఒకనాడు సింహమును మఱికొన్ని మృగములును జేరి సంధి చేసికొని తా మితరులవలన బాధపడునప్పుడుగాని తమ మీద నితరులు దండెత్తినప్పుడుగాని పరస్పరసాహాయ్యము చేసికొను చుండుటకొరకు [illegible] యొడంబడిక నేర్పఱుచుకొనెను. అటు తరువాత నొకసారి సిం[illegible] మూడు మృగములను గలిసి బయలు వెడలి వేటకుఁబోయి యొక బలిసిన జింకను బట్టుకొని చంపెను. వానిలో నొకమృగము సంధినిబంధనల ప్రకారముగ జింకను నాలుగు భాగములుగా భాగించి ముందుగా తనయిష్టము వచ్చిన భాగమును పట్టుకొనుటకై నాలుగు భాగములను రాజుముందు పెట్టెను. అంతట సింహ మా భాగములను వేఱు వేఱ వ్రేలితో జూపుచు "ఇది నేను సింహము నయినందున వంశపరంపరాగత స్వాతంత్ర్యముచేత నాకు రావలసిన యగ్రభాగము. అది మనముచేసికొన్న యొడంబడికను బట్టి శత్రువుతో యుద్ధము చేయవలసి వచ్చినప్పుడు విశేష భారము నా బాహువులమీదనే పడవలసి యుండుటచేత నాకు రావలసిన భాగము. ఆవలిది నేను మృగరాజ నగుటచేత ప్రజలయిన మీ రరియర్పణము నాకు సమర్పింపవలసిన భాగము. ఆ మిగిలినది నా కిప్పుడు క్షుద్బాధ యధికముగా నుండుటను బట్టియు నావద్ద పూర్వసంచితము లేకపోవుటను బట్టియు నే ననివార్యముగా గ్రహింపవలసిన భాగము. కాబట్టి బుద్ధిమంతులయిన మీ రీనాలుగు భాగములను నాకు వదలివేసి మేత వెదకు కొనుటకై యింకొక చోటికి శీఘ్రముగా బొండు" అని పంపివేసెను.

గీ. తనకు నధికునవితో మైత్రి నొనరుచు నెడ
నిజ మయిన సౌఖ్యము లభింప నేర దెపుడు
సర్వ విధముల దనలో డిసములతోడ
జేయుమైత్రియె సర్వదా శ్రేయమిచ్చు.

34. సింహము, ఎలుక

సింహ మొకటి యెండలో దిరిగి యలసి వచ్చి యొక మఱ్ఱిచెట్టునీడను పరుండి విశ్రమించు చుండగా నెలుక యొకటి పరుగెత్తుకొనివచ్చి దానిమీదినుండి దుముకుట తటస్థించెను. దాని పాదములు సోకుటచేత మేల్కొని సింహములికిపడి లేచి నిద్రాభంగము చేసినందునకయి మహారోషముతో చేయెత్తి యా యెలుకను కొట్టి చంపబోయెను. అప్పు డాయెలుక భయముచేత దేహము కంపమొంద గద్గదస్వరముతో "స్వామీ ! నేను క్షుద్రజంతువను. దేవరవారిమహిమ నెఱుగలేక యవివేకముచేత నేను చేసిన యీ యపరాధమును క్షమించి నాకు ప్రాణదానము చేయుడు. మృగసార్వభౌము లయిన యేలిన వారు దండనార్హములయిన మహాజంతువులవయి బ్రయోగింపవలసిన యీ నఖములను నావంటి యల్పజంతువు రక్తములో మయిల పఱుచుట ధర్మము కాదు". అని దీనముగా వేడుకొనెను. ఆ యార్తవాక్యములకు హృదయము కరగినదయి సింహము కరుణించి దానిని చంపక విడిచిపెట్టెను. అంతట మూషకము తాను బ్రతికియున్నంతకాలమును మేలు మఱవనని పలికి మ్రొక్కి వీడ్కొని తన బొరియలో దూఱెను. అటు తరువాత గొంతకాలమునకు సింహ మహారమునిమిత్తము వనమునందు విహారము చేయుచు వచ్చి ప్రమాదవశమున వేటకాడు వన్నిపోయిన వలలో బడి యా మృత్యుపాశముల నుంచి తప్పించుకొనుటకు శక్యము కాకభయంకరముగా నఱచుచు చిక్కులుపడుచుండగా, ఎలుక దాని కంఠస్వరము విని తన కలుగులోనుండి వెడలివచ్చి యెదుట నిలిచి, తాను మున్నుపకారము పొందినయెలుక యగుట తెలిపి సింహమును భయపడవలదని చెప్పి కృతజ్ఞత బయల్పడునట్లుగా కోమలములైన తన దంతములతో వేటకాడు వన్నులోపల వలత్రాళ్ళన్నియు తెగగొఱికి సింహమును మృత్యుముఖమునుండి విడిపించెను.

గీ. కొన్ని వేళల నల్పులు కూడ దాము
ఘనులకునను దోడు చూపంగ గలిగి యుంద్రు;
కావునను దామె ఘనులంచు గర్వపడక
సర్వజనులకు నుపకృతి సలుపవలయు.

●●●●●●●●●●●

35. గ్రద్ద, కప్ప, యెలుక

ముండ్లపొదలతో నిండియున్న యొక గుంటయొక్క స్వామ్యము నిమిత్తమయి యొకదినమున నెలుకయు కప్పయు తగవులాడ నారంభించెను. ఆ తగవులాట యంతకంతకు ముదిరి కొన్ని దినములలో ఘోరయుద్ధముగా మాఱెను. ఆ యుద్ధములో మధ్యమధ్య మూషకము తన కన్నములోనుండి యాకస్మికముగా వయికి వచ్చి శత్రువుమీద వడి గాయపఱచి మరల పోయి తన కలుగులో దూఱుచు వచ్చెను. ఆ కపటయుద్ధమునకు సహింపక కప్ప రోషముతో "ఓ పిరికిపందా! నీ వెప్పుడును దొంగవలె కన్నములోనుండి వచ్చి యేమఱుపాటున మీద పడుదువుగాని ధారాళముగా నెదుట నిలిచి రణశూరుని వలె పోరాడగల పౌరుషము గలదానవు కావు నీవద్ద నిజ మయిన మగతనమున్న పక్షమున బయలికి వచ్చి బహిరంగముగానాతో యుద్ధముచేయుము" అని పిలిచి ద్వంద్వయుద్ధమునకు పురికొల్పెను. అప్పుడాయెలుకయు కప్పయు గట్టుమీదికి వచ్చి నిలిచి గదలకు మాఱుగా చేతులలో చెఱియొక జెల్లుపుడకయు ధరించి గదాయుద్ధముననకారంభించెను. అది యంతయు బయినుండి చూచుచున్న గ్రద్ద యొకటి మింటినుండి బాణమువలె వానిమీద వ్రాలి యా పోటుబంట్ల రెంటిని చెఱి యొక కాలితోను గోళ్ళసందున నిఱికించుకొని యెగతన్నుకొనిపోయి యొక చెట్టుకొమ్మమీద పెట్టుకొని కూరుచుండి యాప్యాయముగా భక్షించెను.

గో. ఒక్కచోటను వసియించు చుండువార
లొండొరులతోడ బోరాడు చుందు రేవి,
హాని యిర్వురకునుగల్గుగాన, నట్టి
మనుజు లైకమత్యంబులో మనగవలయు.

• • • • • • • • • • •

36. చెడ్డకుక్క



ఒక మనుష్యు డొకకుక్కను పెంచెను. అది యింటికి వచ్చిన వారిమీద నెల్ల మొఱుగుచు కనబడినవారి నెల్ల కఱవబోవుచు వచ్చుటచేతవాడు దానివిమెడకొక పెద్ద గుదె కట్టును కట్టి విడిచి పెట్టెను. ఆ వెఱ్ఱికుక్క యా గుదెకట్టు తనకు గౌరవసూచకమయిన యలంకార మనుకొని మఱింత గర్వము గలదయి తనతోడికుక్కలతో సహితము తిన్నగా మాటాడక ముందు తన యాధిక్యమును జూపుచు వానితో గలిసి మెలగుటయే తనకు లాఘవమని భావించుకొనుచుండెను. ఇట్లు ది గర్వముచేత విఱ్ఱవీగుచుండగా దానిచే ననాదరము చేయబడిన మిత్రవర్గములో నొకటయిన ముసలికుక్క యొక్కటి దానివద్దకు

వచ్చి "చెలికాడా ! నీవిప్పుడు మెడనను తగిలించుకొని కులుకుచున్న యీ గుదెకఱ్ఱను జూచి నీవు సిగ్గు పడవలసినదే కాని గర్వ పడవలసినపనిలేదు. నీ దుష్టచేష్టలను జూచి నిన్ను శిక్షించుటకయి యవమాన చిహ్నముగా నీ యజమానుడు దీనిని నీ మెడను గట్టినాడేకాని నిన్ను గౌరవించుటకయి కట్టలేదు. కాబట్టి యిది చూచుకొని విశ్వము మఱచి పొంగబోకు" అని బుద్ధిచెప్పి దానికి గర్వభంగముచేసెను.

గీ. తల్లిదండ్రులు చెప్పుహితంబు వినక
దుష్టవర్తనులై స్వతంత్రుల మటంచు
నిక్కెదరు బాలకులు కొంద రక్కటకట !
సిగ్గుపడ రౌర తమదు దుశ్చేష్టలకును.

• • • • • • • • • • •

37. టేకుచెట్టు, ఱెల్లుగడ్డి

నదీతీరమునందున్న యొక టేకుచెట్టు పెద్ద గాలిచేత విఱిగి పోయి నదిలో కూలి ప్రవాహవేగముచేత గొట్టుకొని పోవుచు, నదియొడ్డున పెరిగియున్న ఱెల్లుగడ్డిలో తన కొమ్మలు తగులుకొనగా నిలిచి, అంతటి ఝంఝామారుతమున కా ఱెల్లుగడ్డి చెట్టు తాళగలిగెనో యని యాశ్చర్యపడి "నావంటి దృఢమయిన మహావృక్షమును సహితము

విఱిచి నేల గూల్ప గలిగినవి ?" యోరుగాలికి వహించి బలహీన తృణమైన నీ వెట్లు సురక్షితముగా నిలువగలిగితివి? అని దాని నడిగెను. "ఆ మహావాయువు నెదరించుట నిష్ఫలమని తెలిసికొని నే నా సమయమునందు నీవలె స్వబలమును నమ్మి తలయెత్తుకొని ప్రతిఘటించి నిలువక గాలియొక్క యుద్రేక మడగువఱకు కొంత సేపు తలవంచుకొని యొదిగియుండి దానిని నామీదినుండి పోనిచ్చి గాలి వడితగ్గినతరువాత మరల నెప్పటియట్లు తలయెత్తు కొని నిలువగలిగిననాను" అని యది యుత్తర మిచ్చెను.

గీ. నిక్కి విఱుగబడుటకంటె వినయమునను
సమధికప్రయోజనన మెందు సంఘటిల్లు ;
స్వల్పకాల మోర్పున దల వంచుకొన్న
ఘనత నెప్పుడు దల యెత్తుకొనగ వచ్చు.

• • • • • • • • • • •

38. గొఱ్ఱెతోలు కప్పుకొన్న తోడేలు

ఒక తోడేలు గొఱ్ఱెతోలు కప్పుకొనివచ్చి గొఱ్ఱెల మందలో బ్రవేశించి యజమానుని కనుమానమూ కలుగకుండ రాత్రివేళ నొక్కొక్క గొఱ్ఱెనే చంపి భక్షింప మొదలుపెట్టెను. ఈ ప్రకారముగా గొన్ని దినములు జరిగినతరువాత గొల్లవాడామోనము కనిపెట్టి, గొఱ్ఱెవేషము వేసికొనియున్న యా తోడేలు మెడకొక త్రాడు బిగించి, చేరువనున్న చెట్టుకొమ్మకు దానిని వ్రేలాడగట్టెను. ఆ వింత చూచి చుట్టుపట్ల పొలములలోననున్న గొల్లవాండ్రక్కడకు వచ్చి గొఱ్ఱెనేలయురితీయు చున్నావనని యడిగిరి. "ఇది గొఱ్ఱె వేషము వేసిన తోడేలు గాని నిజమయిన గొఱ్ఱెకాదు. ఏ వేషములో నున్నను తోడేలును పట్టుకొన్నప్పుడెల్లను నే నిలాగుననే యురితీసెదను." అని చెప్పి పయిని గప్పుకొన్న చర్మము తొలగించి చూపి వారిభ్రమ నివారణ చేసెను. అప్పుడు వారందఱును మాయవేషము వేసినందున కిది

తగినశిక్ష యని సంతోషించి వెడలిపోయిరి.

గీ. కపట వేషంబువలనను గలుగువాసి
వసుధ నిజము బయల్పడువఱకె నిలుచు ;
కల్ల తెలినపపిమ్మట నెల్ల జనుల
మోసగానిని ద్వేషింతు రీను పూని.

• • • • • • • • • • •

39. తోడేళ్లు, గొఱ్ఱెలు

తోడేళ్ళకును గొఱ్ఱెలకును దీర్ఘ కాలము ఘోరయుద్ధము జరిగిన తరువాత తుద కుభయపక్షములవారును విసిగిపోయి సమాధానపడి యంతటినుండి పోరు మాని సుఖముగా బ్రతుకవలెనని నిశ్చయము



చేసికొనినిరి. గొఱ్ఱెలు తమ కావలికుక్కలను విడిచిపెట్టునట్లును, సంధి యేర్పాటులను పూర్ణముగా చెల్లించు వఱకును నమ్మకము

కలుగుటకయి తోడేళ్ళు తమ పిల్లలను గొఱ్ఱెలవద్ద పూట పెట్టునట్లును, ఒప్పుకొందుమని తోడేళ్ళు రాయబారులను బంపగా గొఱ్ఱె లాయొడంబడిక కొప్పుకొని తమ కావలికుక్కలను బంపివేసెను. సంధిపద్ధతుల ననుసరించి తోడేళ్ళు తమపిల్లలను గొఱ్ఱెలయొద్దకు బంపగానే యవి తల్లులు దగ్గఱ లేకపోవుటచేత నేడువ మొదలు పెట్టెను. అది సందు చేసికొని తా మిల్లడగా నప్పగించిన తమబిడ్డలను గొఱ్ఱెలు తిన్నగా చూడక యేడిపించినందున సంధి చెడిపోయిన దని మిషపెట్టి తోడేళ్ళు గొఱ్ఱెలమీద దాడివెడలి కావలి కుక్కలు లేక పోవుటచేత నసహాయములయి యున్న వానిపయిని బడి వాని నన్నిటిని చంపి భక్షించెను.

గీ. తెలివి గలవారు దుష్టులపలుకు నమ్మి
యెక్కయప్పుడు నేమఱి యుండ దగదు ;
ఆత్మరక్షణ మేమఱి మహిను లాడు
తేనెమాటలు పాటింప హాని వచ్చు

40. ఒంటికంటి జింక



ఒక జింకకు దైవికముగా కన్నొకటి పోయెను. అది యందుచేత మేతకయి ప్రతిదినము సముద్రపుదరికి బోయి నీటివైపునుండి యేమియు నపాయము రాదనుకొని గ్రుడ్డికన్ను వైపునకును వేటగాండ్రను కుక్కలను దూరమునుండి చూడగానే పారిపోవచ్చునని మంచికన్ను నేలవైపునకును బెట్టి మేత మేయుచుండును. ఇట్లు జరుగుచుండగా నొకనాఁడస్త్రయుతు వేట కాండ్రు చిన్నపడవ యెక్కి దానికి గనబడకుండ సముద్రము మీద మిక్కలి చేరువకు వచ్చి గురిచూచి దానిని తుపాకితోఁ గొట్టిరి, గుండుదెబ్బ తగిలి చచ్చునప్పుడది "అపాయము వచ్చు ననుకొన్న నేలవైపునుండి నా కేయపాయమును లేకపోయినది. అపాయము లేక సురక్షితముగా నుందుననుకొన్న నీటి ప్రాపున నుండియే నాకిప్పుడ ప్రాణాపాయము సంభవించినది. ప్రాణము నందలి యత్యాశచేత నేను నిష్కారణముగా నడవి విడిచి సముద్రమునకు వచ్చి యీ విపత్తు దెచ్చుకొన్నాను." అని పరితపించుచు ప్రాణములు విడిచెను.

గీ. ఒకటి తా దలంపగ దైవ మొకటి తలచు
గావునను మానవుండు తా జీవనంబు
కొఱకె యెపుడు నత్యాశ గైకొనక ధర్మ
చింత చేయ వలయు భగవంతు నమ్మి.

● ● ● ● ● ● ● ● ● ●

41. నక్క, తెవులుగొంటి సింహము

సింహము వ్యాధిబాధితమయి యున్నదని యరణ్యములో నొక ప్రవాదము కలిగెను. అందుచేత నప్పుడరణ్యములోనున్న మృగములన్నియు సింహసందర్శనార్థము పోవ నిశ్చయించుకొనెను గాని నక్కమాత్రము వానితో జేరి పోక పోయెను. అది యెఱిఁగి సింహము నక్కను పిలిపించి "నేను వ్యాధిగ్రస్తుడనయి లేవలేకున్నప్పుడు తక్కిన

సమస్త మృగములును వచ్చి నన్ను జూచిపోవుచుండగా నీవుమాత్ర మేల రావైతివి ?" అని యడిగెను. స్వామి ! తక్కినజంతువుల కెంతప్రభుభక్తి కలదో యంత ప్రభుభక్తి దేవరవారియెడనాకును గలదు. నేను దేవరసందర్శనార్థమయి యనేక పర్యాయములు తమ గృహద్వారము వరకును వచ్చినాడను. అయినను స్వామిదర్శనమునకు వచ్చినమృగము లన్నియు లోపలికి బోవుటయే కాని మరల వెలుపలికి రాకుండుట గుహాముఖము నందలి యడుగుల జాడవలన దెలిసికొని గుహలో నేదో వైపరీత్యమున్న దని భయపడి లోపల నడుగిడుటకు సాహసింపలేకపోయినాను" అని నక్క ప్రత్యుత్తర మిచ్చెను. నిజముగా సింహమునకు రోగపీడ కలుగనేలేదు. ఈ మిషమీద మృగములను లోపలి నాకర్షించి యనాయాసముగా జంపి భక్షింప వచ్చునని సింహమే యీ పన్నుగడ పన్ని వట్టి ప్రవాదము వేసినది.

గీ. పరులకు దటస్థమైన యాపదలవలన
దెలివి గలవారు బుద్ధిని దెచ్చుకొంద్రు,
కావునను బుద్ధిమంతులు కన్నుగలిగి
యనయమును లోకవృత్తంబు లరయవలయు.

• • • • • • • • • • •

42. డేగ, కాపువాడు

ఒక కాపువాడు తనచేనిలోని జొన్నకంకు లన్నియు కాకులు తిని పోవుచుండటచేత వానిని పట్టుకొనుటకయి చేరువ చెట్టుమీద వల పన్ని తాను దూరముగా నిలుచుండి చూచు చుండెను. అప్పుడు డేగ యొకటి యొకపావురమును తఱుముకొని వచ్చి యా తొందరలో వలలో బడెను. ఇట్లాడేగ వలలో దగులుకొని కొట్టుకొనుచుండగా

గాపువాడు వచ్చి దానిని పట్టుకొని చంపబోగా, అది "ఓయీ ! నన్ను చంపుటకు నీకు నేనేమియు నపకారము చేయలేదు. నేనీపావురమును బట్టు కొనుటకయి నీ పొలమునకు వచ్చితినే కాని నీ చేనిలోని గింజలు మేయుటకయి రాలేదు. కాబట్టి నా ప్రాణములు గొనక నన్ను విడిచి పెట్టుము" అని ప్రార్థించెను. "చంపుట కయి నీకీ పావుర మేమి యపకారము చేసినది?" అని పలుకుచు వాడు దానిని మెడవిఱిచి చంపెను.

గీ. మదిని బరు లెట్లు చేయ గోరుదు మొ మనకు
బరుల కట్లె చేయఁగ జూడవలయు మనము
ఒరుల కపకార మొనరింప నూహ చేయ,
నవల మనకును నపకార మావహిల్లు.

● ● ● ● ● ● ● ● ● ● ●

43. పిల్లి, యెలుకలు

ఒక గృహము నందెలుకల బాధ యతివిస్తారము కాగా, ఆ యింటివా రొకపిల్లిని దెచ్చి పెంచిరి. ఆ పిల్లి ప్రతిదినమును దొరకిన యెలుకల నల్ల బట్టి భక్షింపసాగెను. ఈ ప్రకారముగా గొంతకాలము జరిగినమీదట దమసంఖ్య యంతకంతకు దక్కువగచు వచ్చుచున్నందుల కెంతో చింతనొంది యెలుకలన్నియు నొక చోట సభచేసి యాలోచించుకొని యింక ముందెప్పుడును తా మటుకమీదనుండి క్రిందికి దిగి రాకుండు నట్లు నిశ్చయము చేసికొనెను. ఆ నియమమునుబట్టి యెలుకలు క్రిందికి రాకుండుట కనిపెట్టి మార్జాలము కడుపుచిచ్చు చేత మలమల మాడుచు మూషకములను మాయోపాయముచేత నాకర్షించి పట్టు కోవలెనని యాలోచించి, వెనుకటి కాళ్ళు గోడలు నున్న యొక

చిలుకకొయ్యకు తగిలించి యూపిరి బిగబట్టి చచ్చినటు తలక్రిందుగా వ్రేలాడుచుండెను. పిల్లి యీ ప్రకారముగా గొంతెసేపున్న తరువాత వృద్ధమూషకమొకటి మెల్లగా గోడమూలకు వచ్చి తొంగిచూచి "ఓహో! మాయలమారీ! నీ విక్కడనే యున్నావా? అట్లే యుండుము. నీ చర్మమొలిచి లోపల గడ్డివేసికుట్టి విలువబెట్టినను విన్ను నేను నమ్మను." అనవి పలికి తొలగిపోయెను.

గీ. అనుభవంబునుబట్టియే యవవియుందు
జనులకును దెల్వి యబ్బుట సహజగుణము,
కాలు గాలి శ్రమంపడుగండుబిల్లి
విప్పువద్దకు బోవునే యెప్పుడైన.

44. దుఃఖకర వివాహము

ఒక యెలుక యూరిత్రాడు కొటికి సింహముయొక్క ప్రాణము రక్షించినందున దానియం దత్యంతానుగ్రహము కలదయి కోరిన

యుపకారమును జేయ దలచుకొని యా సింహమెలుకను జూచి నీ కేమి కావలయునో కోరుకొమ్మని చెప్పెను. రాజానుగ్రహముచేత గర్వించి దేహము మఱచినదయి యా యెలుక యేది యడుగదగునో యేది యడుగదగదో యన్న చారములేక తాను గొప్పవాడను గావలెనన్న దురాశచేత సింహముయొక్క కొమార్తెను తనకిచ్చి వివాహము చేయ వలసినదని కోరుకొనెను. అన్నమాట దిరుగక సింహము తానుజేసిన వాగ్దానానుసారముగా తన పుత్రికను మూషకమునకిచ్చి వివాహము చేసి క్రొత్తయల్లునికోరిక చెల్లించెను. అటుతరువాత వధూవరు లొకనాడు వనవిహారము చేయుచుండగా బ్రమాదవశమున భార్యయొక్క పాదమొకటి భర్తమీద పడినందున, తక్షణమే యా యెలుక పెండ్లికొడుకు ప్రియురాలి యొక్క నఖక్షతసుఖముభవించుచు కాలియడుగున నలిగి పోయి యనాయాసముగా స్వ ర్గస్థుడయ్యెను.

గీ. వంశమందను స్థితియందు వయసునందు
సర్వవిధముల బేండ్లికి సమత వలయు;
సమతలేని వివాహముల్ చాలవఱకు
నంతమున దుఃఖ హేతువు లగుచు ముగియు.

● ● ● ● ● ● ● ● ● ● ●

45 పిచ్చుక, యితరపక్షులు

ఒక కాపువాడు తన పొలములో జనుపవిత్తులు చల్లుచుండెను. అది చూచి పిచ్చుక తక్కినపక్షులవద్దకు బోయి, వేటగాండ్రనంఖ్య ములయిన సాధుపక్షులను ప్రతి సంవత్సరమును పట్టి హింసింపగలుగుట యీచెట్టునార పేని చేసిన దారములతో నల్లిన వలలమూలముననే కాబట్టి యిప్పుడే మన మందరమును జేరి చల్లినవిత్తనముల నెల్ల మొలవక మునుపే యేఱి నాశనము చేయవలెనని చెప్పెను. ఆ పక్షులామాట లలక్ష్యముచేసి యూరకున్నందున కొన్ని దినముల

లోనే జనుపవిత్తులు మొలకలెత్తి భూమిమీద తల చూపెను. అప్పుడాపిచ్చుక మరల పక్షులను పిలిచి యింతటనైను బుద్ధి తెచ్చుకొనిపక్షికులమునకు ప్రాణాపాయ కరమయిన యా జనుపనారను మొలకలతోనే పీకివేయవలసినదని వేడుకొనెను. ఆ పక్షు లప్పుడును దానిమాట యాదరింపనందున జనుప మొక్కలు పెరిగి చెట్లు కా నారంభించెను. అప్పటికిని సమయము మించిపోలేదని చెప్పి యాచెట్లకను వేళ్లతో పెల్లగించి రూపుమాపవలసినదని కడసారి పిచ్చుక యా పక్షులను మరల ప్రార్థించెను. ఆ పక్షు లాపలుకులు పెడచెవినిబెట్టి 'నేటి కాలమునకు పక్షులలో నొక యపూర్వ దీర్ఘదర్శి బయలు దేఱె"నని మీదుమిక్కిలి యా పిచ్చుకను పరిహాసము చేయజొచ్చెను. అంతట పిచ్చుక తనే కృషియంతయు వ్యర్థమగుట జూచి, రాబోవు సంగతిని కనిపెట్టి ముందుగా మెలకువ పడలేని మూర్ఖశిరోమణులతో గలిసి క్షణకాలమును వాసముచేయరాదని తలచి, జనుము పెరిగి త్రాళ్ళ కక్కఱకు రాకమునుపే యా పక్షులున్న యడవిని విడిచి లేచిపోయి యప్పటినుండియు మనుష్యులు వాసముచేయు గృహముల చూరులలో గూండ్లు కట్టుకొని నివసించుచుండెను.

గీ. ఆపదలు వచ్చినప్పు డల్లాడుకంటె
నాదినే మాన్పుకొనుమార్గ మరయవలయు ;
ముందు చూడక ప్రస్తుతమునె తలంచు
మూఢు డాపదలకు జన్మభూమి మగును.

● ● ● ● ● ● ● ● ● ● ●

46. ఎద్దు, కప్ప

ఒక యెద్దు పొలములోమేయుచు క్రిందనున్న కప్పపిల్లల మీద నడుగువేయగా వానిలో నొకటి నలిగి చచ్చెను. తోడనే కప్పపిల్ల లన్నియు పరుగెత్తుకొనిపోయి తల్లి కాసంగతి తెలిపి, తమ్ము నలుగ ద్రొక్కినంత పెద్దజంతువును తాము జన్మమెత్తిన తరువాత నెప్పుడును జూడలేదనిచెప్పెను. అది యెంతపెద్దదని తల్లియడిగెను. ఇంతింతయని చెప్పశక్యము కానంత పెద్దదని పిల్లలు పలికెను. అప్పుడు తల్లికప్ప తన శరీరము పెంచి "ఇంతయున్నదా ?" యని యడిగెను. ఇంతకంటపెద్దదని పిల్లలుత్తరమిచ్చెను. ఆ మాటలు విని యా బోదురు కప్ప దేహము మఱింత పెంచి నిక్కి "ఇంత పెద్దదిగా నున్నదా ?" అని మరల నడిగెను. నీ వెంతపెరిగినను దానితో సహస్రాంశముండదని పిల్లలు మాఱుపలికెను. అందుమీద రోషము వచ్చి యాకప్ప తానెంత పెద్దదిగా పెరగవలెనన్న యపేక్ష చేత పెరిగి యూపిరి బిగబట్టి మరింత పొట్టయుబ్బించి తుట్టతుదకు పొట్టపగిచ్చి వచ్చెను.

గీ. అధికులను జూచి యోర్వ కహంకరించి
తనకు లేనట్టి యాధిక్యమును నటింప
ఘనవిపత్తుగు గావున దనదుస్థితికి
మించువేషంబు వేయక మెలగ వలయు.

● ● ● ● ● ● ● ● ● ● ●

47. పాము, ఆకురాయి



పాముకటి యొకనాటిరాత్రి మేతకయి బయలు దేరి కమ్మరవాని పనిశాలలో ప్రవేశించి తినుట కేమయిన దొరుకు నేమోయన్న యాశచేత పనిముట్లమీద బడి, ఆకురాయి నోటగఱచుకొని గట్టిగా కొఱుక నారంభించెను. అప్పుడా యాకురాయి దానిని జూచి నవ్వి "ఓ వెఱ్ఱిపామా ! నీవేల వృథా శ్రమపడెదవు ? నే నితరవస్తువులను తినుదాననేకాని యితరముచేత నెప్పుడును తినబడుదాననుగాను. ఇనుము మొదలైన లోహములనే పొడుముచేసెడు నన్ను కొఱుకుట వలన నీ పండ్లు మొఱవలు పోవుటయేకాని వేఱు లాభము గలుగదు. కాబట్టి నీవు నన్ను విడచి శీఘ్రముగా మఱియొక చోటికి బొమ్ము" అని పలికెను.

గీ. పలువు రీ లోకమునం దమ కలవికాని
పనులకు గడంగి నిర్వహింపంగ లేక
కడపటను దామె హాని గాంతు రెపుడు
కలుగునె ప్రయోజన మసాధ్యకార్యములను !

48. కుందేళ్ళు, కప్పలు

ఒక దినము పెద్ద గాలివాన పట్టి, ఓరుగాలి చెవులు చిల్లులుపోవునట్లుగా వినరనారంభించెను. ఆ ధ్వని విని భయపడి కుందేళ్ళు కొన్ని నానాముఖముల పరుగులెత్తి యెందుబోయి నను ధ్వని యంతకంత కధికమయి మఱింతభీతిని గలిగింపగా తాళజాలక, అటువంటి తెంపులేని కష్టజీవము జీవించుటకంటె నొక్కసారిగానీటిలోమునిగి యాత్మహత్య చేసికొని తమ కష్టములను గట్టెక్కించుకొనుట మంచిదని నిశ్చయించుకొని, తమయెదుట గానబడుచునన్న సరస్సువద్దకు పరుగెత్తెను. అవి నీటిసమీపమునకు బోవునప్పటి కావలి కొడ్డున నున్న కప్పలన్నియు నకాలప్రళయము వచ్చునట్లు భయపడి పరుగెత్తి నీటిలో దుమికి మునిగి యడుగుననకు బోయి యదృశ్యములయ్యెను. అప్పు డొక్క ముసలికుందేలు కప్పల యా దుస్థితిని జూచి తోడికుందెళ్ళను జేరబిలిచి "ఆత్మహత్య మానుకొండి. మనకంటెనను నెక్కువ కష్టముగల జంతువు లిప్పుడు నాకంటికి గనబడుచున్నవి. లోకములో మన మొక్కరమే భాగ్యహీనులము కాము. మనలను జూచి భయపడి నీటిలో బడుచున్న యీ కప్పలు మనకంటెను నిర్భాగ్య దశలో నున్నవి. కాబట్టి వీనిని జూచి మన మిప్పుడు ధైర్యము తెచ్చుకొని యాపదలను శాంతతతో సహించుటను నేర్చుకోవలెను." అని చెప్పి వాని సాహసోద్యమమును మాన్పి వెనుకకు దీసికొని పోయెను.

గీ. అవగుణంబులలో నధైర్యంబుకంటె
నధికదుర్గుణ మొకటి లే దరసి చూడ,
ఆపదలయందు నీశ్వరు నాత్మ నమ్మి
ధైర్య మూనిన, ధైర్యంబె తన్ను గాచు.

● ● ● ● ● ● ● ● ● ● ●

49. కడుపు, అవయవములు

పూర్వకాలమునం దొకసారి కడుపుతో నితరావయవములను శుష్కకలహ మొకటి సంభవించెను. అప్పుడు కార్యనిశ్చయము నిమిత్తము తక్కిన సమస్తావయవములును సభచేసి యాలోచనచేయ మొదలు పెట్టగా వానిలో నొకటి "మనము పడుశ్రమకు ప్రతిఫలమేమియు జేయక తేరతిండి తిని యంత కంతకు బెగబలియుచున్న యీ పొట్ట నిమిత్తమయి మనమేల పాటుపడవలెను?" అని పలికెను ; ఇంకొకటి "మనము కష్టపడి యమర్చిన సమస్తపదార్థములను పనిపాటులు లేక యూరక కూరుచుండి యనుభవించుట కీపాడు పొట్ట కేల సమర్పింపవలెను?" అని న్యాయము చెప్పెను; మఱియొకటి "రేపటినుండి మన సేవను మానివేసి తిండి పెట్టక పొట్టను మాడ్చివేయవలెను" అని కర్తవ్యము నుపదేశించెను. అందుమీద నవయవములెల్ల నౌనౌ ననుకొని, వస్తుపెట్టి పొట్ట క్రొవ్వడపవలెనని యేక వాక్యతగా నిశ్చయముచేసెను. ఆ నిశ్చయములను బట్టి పని చేయక తిరుగబడి చేతు లాహారపదార్థములను నోటి కందియ్య మానుకొనెను; నోరు పదార్థముల నందుకొనుట చాలించెను; పండ్లు నమలుట వదలివేసెను; గొంతుక మ్రింగుట విడిచిపెట్టెను. ఈ ప్రకారముగా సాధ్యమయినంతవఱ కవయవము లన్నియు; తమ తమ వ్యాపారములను గట్టిపెట్టి కడుపును శిక్షింపవలెనన్న దీక్షపట్టి యా నియమమును గొన్నిదినములు జరుపునప్పటికి దేహములోని రక్తమాంసములు క్షీణించి యెముకలు బయలు పడగా, బలహీనపడి చిక్కి చేతులు కదలమెదలలేకపోయెను; నోరు దౌడల నాడింపలేకపోయెను; పండ్లు పయికెగయలేకపోయెనను; గొంతుక యెండిపోయెను. అంతట నాయవయవము లన్నియు బుద్ధి తెచ్చుకొని, తమ యవివేకమునకు పశ్చాత్తాపపడి, పయికి సోమరివలె గానబడినను

కడుపు తమ యారోగ్య సౌఖ్యములకొఱకు సాహాయ్యపడుచున్నదని తెలిసికొని, మరల యధాపూర్వకముగా పాటుపడి తమతమ పనులను నిర్వహింప మొదలు పెట్టెను. అటుపిమ్మట గొన్ని దినములలో నడుమ గలిగిన బలహీనతపోయి క్రమక్రమముగా వెనుకటి జవసత్త్వములు రాగా, అవయవములన్నియు నైకమత్యముతో బరస్పరక్షేమ నిమిత్తము పాటుపడుచు నెప్పటి సుఖము ననుభ వించుచుండెను.

గీ. భువినని మనుజుడు తన సౌఖ్యమునకె కాక
పరులకయి కూడ బుట్టింపబడినకతన
స్వార్థపరతను విడనాడి సర్వజనులు
నొండొరులకయి శ్రమపడు చుండవలయు.

• • • • • • • • • • •

50. ఎద్దు, దూడ

ఒక యెద్దు పొలములో నాగలి యీడ్చుచుండగా జూచి యా పొలములోనే మేతమేసి బలిసి పొగరెక్కి గంతులు వేయుచున్న దూడ యొకటి దానియొద్దకు వచ్చి గర్వముతో "ఓ యెద్దా! సూర్యోదయము మొదలుకొని సూర్యాస్తమానమువఱకును మెడమీద కాడి వేసికొని విరామములేక దున్నుచు నీ వెంత నిర్భాగ్యపు జీవనము జీవించు చున్నావు! ఇన్ని యేండ్లు గడచినను నీవు నీ యజమానికి బానిసవై యుండి బండపని చేయుచు దుఃఖపడుచుండుటతప్ప వేరేమియు నేర్చుకోలేదు. చిన్ననయ్యు నీ కన్నుయెదుట నేనెట్లు సుఖపడుచున్నానో చూడు. కొంతసేపు చెట్లనీడను విశ్రమించుచు కొంతసేపు బయల గంతులు వేయుచు నేను నా చిత్తము వచ్చినట్లు సంచరింపగలను. స్వేచ్ఛ లేని నీ కష్టజీవనమును జూచి నాకు సంతాపము గలుగుచున్నది." అని పరిహాసముచేసెను. ఆ యెద్దాయవ మానమునకు సహించి

దానిమాటలు గణనచేయక తనపని తాను జేసికొనుచుండెను. నాడు దున్న వలసిన పనియైన తరువాత పొలము కాపా యెద్దు మెడకాడి విప్పి దానిని వచ్చిక చీటిలో మేతకు విడిచి పెట్టెను. మఱికొన్నినిముషములకు యజమానుడా దూడను బట్టుకొని దానిమెడలో వేపరొట్ట కట్టి తాను వెనుక మ్రొక్కుకున్న మ్రొక్కు చెల్లించుటకయి నాటి సాయంకాల మాదూడను గ్రామదేవతకు బలి యిచ్చుట కొఱకు తీసికొని పోవుచుండెను. తన సమీపమునుండి బలవంత ముగా పీడ్చుకొని పోబడుచున్నప్పు డెద్దు దూడచేరువకు బోయి చెవిలో మెల్లగా "ఓ వత్సా రెండు గడియలక్రిందట మహా గర్వముతో నాస్థితిని జూచి పరిహాసము చేసిన నీ కెప్పుడెట్టిగతి పట్టుచున్నదో చూచినావా ! ఈ పని నిమిత్తమే నీ యజమానుడు యథేచ్ఛముగా విడిచి నిన్నింత బలపించినాడు, నీస్థితి మంచిదా నాస్థితి మంచిదో యిప్పుడు నీకు బోధపడినదా !" అని హెచ్చరించెను.

గీ. పడుచుతనమును గర్వంబు బుడమిమీద
జెలిమిమై సదా జనులందు గలిసియుండు;
గావునను బాలు రెప్పుడుగర్వమునను
జేరి పెద్దల నెగగతాళి చేయరాదు.

● ● ● ● ● ● ● ● ● ● ● ●

51. నెమలి కొంగ

దైవికముగా నొకనాడు నెమలియు కొంగయు నొకచోట సమావేశమగుట తటస్థించెను. అప్పుడు నెమలి గర్వముతో తోక పయికెత్తి చిత్రవర్ణములు గల తన పింఛము యొక్క సౌందర్యములు జూపుచు రూపహీనమయిన కొంగను జూచి తిరస్కారభావముతో దాని శ్వేతవర్ణమును గూర్చి హేళనముగా మాటాడెను. ఆ సంగతి కనిపెట్టి యా బకము దాని గర్వభంగము చేయవలెనని తలచుకొని

నెమలిని జూచి ఓ మిత్రమా ! ఒక్క ఱెక్కలవన్నెలనుబట్టి చూచినపక్షమున పక్షి జాతిలోనెల్ల నెమళ్ళు మిక్కిలి చక్కనివగుట నిశ్చయమే. అయినను భూమిని విడిచి పదిబారలు పయి కెగయక సదా నీచపదమునందే యుండి పయివన్నెలనుచిన్నెలును బట్టి మూఢులచేత మెప్పొందుచుండుటకంటె మావలె గగనమార్గమున మేఘమండల మతిక్రమించి మహోన్నతపదము నొంద గలిగినయెడల నెమళ్లును సర్వ జనశ్లాఘాపాత్రములయి యుండును గదా!" అని యెత్తిపొడిచెను.

గీ. జగతిలోపల బాహ్య వేషములకంటె
సద్గుణంబులు గలుగుటె శ్లాఘ్యతరము,
పయి మెఱుంగులు రంగులవనలు లేక
శుద్ధహృదయులు లోకవిశ్రుతులు గారె ?

52. చీమ, మిడుత

చలికాలము రాగానే నందడి చేయుచు చీమలన్నియు తమ కలుగుచుట్టును గుంపుగాజేరి తా మావఱకును వేసవి కాలములో సంపాదించి నిలువచేసికొన్న ధాన్యమునంతను బయికిదీసి యెండబోసి



తూరుపాఱబెట్టి శీతకాలగ్రాసము నిమిత్తము బాగుచేసికొనుచుండెను. అప్పుడాకలిచేతను చలిచేతను బాధపడుచు నొక మిడుత వాని యొద్దకువచ్చి, తనకు గొంత ధాన్యమిచ్చి శీతకాలములో తిండిలేక చావకుండ తన్ను కాపాడుడని మిక్కిలి దీనత్వముతో వేడుకొనెను. అప్పుడొక చీమ ముందుకు వచ్చి "మిత్రుడా! నీవు వేసవికాలమంతయు నెట్లు గడపినావు ? మావలె కష్టపడి పనిచేసి శీతకాలమునకు గావలసిన యాహారము కూడబెట్టుకోలేదా ?" అని యడిగెను. "లేదు. వసంతకాలమంతయు ఆటలతోను పాటలతోను వినోదముగా గడిపినాను. నా కప్పుడన్నము పుట్టని పాడుశీతకాల మొకటి ముందువచ్చు నన్నస్మరణయే లేకపోయినది" అని మిడుత యుత్తరమిచ్చెను. ఆ మాటలకు మందహాసముచేసి చీమ "అట్లయిన పక్షమున వేసవికాలములో పాటుపడక యాటపాటలతో కాలము వ్యర్థపుచ్చినవారు శీతకాలములో నష్టపడి చావవలసినవారే." అని పలికి యేమియు నియ్యక దానిని సాగనంపెను.

గీ. యౌవనంబున గాలుచే యాడుతఱినె
కూర్చి ముదిమి కించుక దాచుకొనగ వలయు;
ప్రాయమును వేడుకల బాడు చేయువాడు
వయసు జాఱినవెనుకను వ్యసన మొందు.

● ● ● ● ● ● ● ● ●

53. బొంతకాకి, నెమళ్ళు



బొంతకాకి యొకటి తనస్థితితో తృప్తిపొంది యుండక తన జాతివారిని మించవలెనన్న దురతిశయము కలదయి యందందు తిరిగి నెమలియీకలేఱితెచ్చి తనతోకకు గ్రుచ్చుకొని నెమళ్ళగుంపులోనికి బోయి చేరెను. అది తమలో వచ్చి చేరగానే యా సుందరమయూరములు మాలకాకినిజూచి యలిగి, దాని యెరవుఱెక్కల నూడబెఱికి ముక్కులతో బొడిచి కాళ్ళతో దన్ని యర్ధదండనము చేసి యావలకు సాగనంపెను. ఇట్లు గర్వభంగము కలిగి యవమానము జరిగిన మీదట నాకాకి సిగ్గుతో నేడ్చుచు మరల వచ్చి తన బంధువర్గముతో జేరెను. అవి యా పలుగాకి యొక్క పూర్వపు దురహంకారమును దలచి తమలో జేర్చుకొనక దానిని తఱిమివేసెను. అది తలవంచుకొని తొలగుచుండగా నొకకాకి దానిని జూచి "ఓ చెడుగా ! నీవు నీకర్హమైన స్థితితో తృప్తిపొంది యీ పెద్దవేషమును వేయకుండిన పక్షమున, నీవు కోరుకొని చేరబోయినవారలో నవమానమును స్వజాతి వారిలో బహిష్కారమును పొందక సుఖముగా నుండియుందువు. కుడిచి కూరుచుండలేక నీ

నీలెవిపోని వేషము వేసినందుకు నీవు తగిన గర్వప్రాయశ్చిత్తమైనది"
అని పరిహసించెను.

గీ. తనకు దగనివేషంబును దాల్చబోక
యెల్లరు యథార్థ గతినె వర్తిల్ల వలయు,
అర్హతకు మించునాధిక్య మభినయించు
నీచుడు స్వపక్షపరపక్షనింద్యు డగును.

• • • • • • • • • • •

54. ఇంద్రుడు, బండివాడు

బండివాడొకడు తన కట్టులబండిని బురద నందులో నుండి తోలుకొని పోవుచుండగా చక్రములు రొంపిలో దిగబడ యెడ్లెంతలాగినను బండి కదలకపోయెను. అది చూచి బండిదిగి నిలచి వాడాకాశమువంక జూచి చేతులు జోడించి తనకు సాయము చేయవలసినదని యింద్రుని ప్రార్థించెను. అప్పుడు దేవేంద్రు డక్కడ ప్రత్యక్షమయి మేఘములలోనుండి మొగముచూపి, క్రింద చేతులు జోడించుకొని నిలువబడియున్న బండివానిని జూచి "ఓరి మూర్ఖుడా! ఆకాశమువంక జూచుచు పనిచేయక యూరక మొద్దులాగున నిలుచున్నావేమి ? ఎడ్లనుతట్టి యుత్సాహపరిచి నీ సత్తువకొలది రెండు చేతులతోను బండిచక్రములుపట్టి గట్టిగా త్రోయుము. నావలన సాహాయ్యము పొందుక్రమ మిదే" అని చెప్పెను. అంతట వాడింద్రుడు చెప్పిన ప్రకారముగా తనసత్తువ యంతయు జూపిత్రోయగానే చక్రము బురదలోనుండి లేచి బండి కదలెను.

గీ. ఒడలు వంచి బాగుగ గష్టపడెడునట్టి
వానికే తోడుపడును దైవంబునెపుడు;
పనికి జొరక దేహము దాచుకొనెడునట్టి
మందున కెవండు తోడ్పడ మది దలంచు ?

• • • • • • • • • • •

55. కుక్క, గొఱ్ఱె



కుక్క తన కియ్యవలసిన యప్పు తీర్పవలసినదని గొఱ్ఱెతో లేనితగవొకటి పెట్టుకొనెను. గొఱ్ఱె తన కాబుణసంగతియే తెలియదనిచెప్పెను. అప్పుడు కుక్క మధ్యవర్తులవద్దకు పోదము రమ్మని గొఱ్ఱెను బిలుచుకొనిపోయి, తోడేలును గ్రద్దను ధర్మాధికారులుగా నుండి తగవు తీర్పవలసినదని కోరెను. అవిమాధ్యస్థ్యమున కొప్పుకొని న్యాయాధిపతులవలె మంచిబట్టలు వేసికొని ధర్మనిర్ణయము చేయుటకయి గంభీరముగా గూరుచుండి వాది ప్రతివాదములు విని, అప్పు పుచ్చుకొన్నందునకు సాక్ష్యము లేకపోయినను వాదిపక్షమున న్యాయము తీర్చెను. తీర్పు ప్రకారముగా వెంటనే కుక్క గొఱ్ఱె మీదబడి దానిని కఱచి చంపగా వాదియు న్యాయాధిపతులును గలిసి దాని మాంసమును పంచుకొని తినిరి.

గీ. లంచము గ్రహించి కొవంలుముంచువారు
తగవులను దీర్చుటకు ధర్మదాత లైన,
మూలముట్టుగ ధర్మంబు మూలబట్టి
సత్పురుషుల కనర్థంబు సంభవిల్లు

56. కాకి, కుండ

కాకి దాహముచేత బాధపడుచు నీటినిమిత్తమయి వెదకుచుండగా నొకచోట దాని కొక కుండ కనబడెను. అప్పుడది సంతోషించి కుండవద్దకు బోయి చూచునప్పటికి దానిలో నీ రట్టడుగున నుండెను. అందుచేత నా కాకిమెడ చాచియు తలక్రిందుగా వ్రేలియు నీరందుకొన జూచెనుగాని యెన్నివిధములు కృషి చేసినను దాని యభీప్సితము ఫలించినది కాదు. తరువాత కాకి యాకుండను తలక్రిందుచేసి క్రింద కారిననీరు త్రాగవలెనని ప్రయత్నము చేసినను కుండ మిక్కిలి బరువయినదగుటచేత దానిని కదలించుటచే సాధ్యమయినది కాదు. అటు పిమ్మట నేమి చేయుటకును తోచక కాకి కొంచెము సేపాలోచించి

యా చెరువను గులక రాళ్లుండుటచూచి యా రాళొక్కొక్కటే ముక్కున గఱచుకొని వచ్చి యాకుండలో బడవైచి నీరు పయికివచ్చిన తరువాత మెడవంచి కావలసిననీరు త్రాగి దాహము తీర్చుకొని తనదారిని పోయెను.

గీ. పనికి మంచియాలోచన వలయు మొదల;
నిష్ఫలం బగు బలమెల్ల నేర్పులేక
బలము యోచన రెండును గలియునేని,
సర్వకార్యంబులను గృషి సఫలమగును.

● ● ● ● ● ● ● ● ● ● ●

57. దుప్పి, దుప్పిపిల్ల

ఒక దుప్పి మిక్కిలి బలిసినదయి కండక్రొవ్వున కనబడినవాని నెల్ల గొమ్ములతో పొడుచుచు కాళ్లతో తన్నుచు మందలలోగల దుప్పుల కన్నిటికిని భయము కలుగజేయుచుండెను. ఇట్లుండగా నొకనాడు దుప్పిపిల్ల యొకటి దాని యొద్దకు వచ్చి "అమ్మా ! నీవింత బలిసి యీటెలవంటి కొమ్ములతో బొడిచి మందలో గల దుప్పుల నన్నిటిని దఱిమి బెదరింప శక్తి గలదానవయ్యును, నీకంటె జిన్నవయిన వేటకుక్కల మీద నీ బలమును జూపక వానికూత వినబడగానే పాఱిపోయెదవేమి ? అని యడిగెను. "నీవన్నట్లిప్పుడు నా దేహములో పుష్కలముగా జవసత్త్వములున్నవి. ఆ బక్క కుక్కల నొక్కొక్కదానినే యొక్కొక్కపోటుతో నేలపాలు చేయగల బలము నాకు గలదనియే నా నమ్మకము. ఇంకొకసారి వేటకక్క నామీదికి వచ్చినప్పుడు పడగ్రుమ్మి నా శక్తి నంతను జూపి దానికి బుద్ధివచ్చునట్లు చేయవలెనని ప్రతిపర్యాయమును నేను మనస్సులో ననుకొనుచునే యుందును.

అయినను కుక్క నాకంటబడగానే నాకాళ్ళు నామాట వినక మనస్సును భయపెట్టి నన్ను కుక్కతో బోరాడనియ్యక దూరముగా నీడ్చుకొని పోవుచుండును. నేమి చేయగలను ? ఎవ్వరికిని స్వభావమును మీఱుట శక్యము కాదుగదా ?" అని దుప్పి చెప్పెను.

గీ. పయికి మాటల నెన్నిటి బలుకుచున్న
బనితఱివి స్వభావము మార్చ గనకయుండు,
జగతి దీర్ఘ కాలాగతాచారములును
రెండవస్వభావములుగ నౌ చుండు నెపుడు.

• • • • • • • • • • •

58. తోకలేని నక్క

ఒక నాటిరాత్రి యొక నక్క తోక కత్తెరబోనులో చిక్కుకొని యూడిరాకపోగా, తోక పోయినను ప్రాణములు తప్పించుకొని యీవలబడిన జాలునని సంతోషించి యా నక్క తోక త్రెంచుకొని పాఱిపోయెను. అది తరువాత దన యింటికి బోయి సావకాశముగా తన వమొండితోకను జూచుకొని తనవారి కీ సంగతి తెలిసినపక్షమున గులమువారిలో దనకు దలవంపులుగా నుండునని తలచి యటువంటి యవమానపు బ్రతుకు బ్రతుకుటకంటె మరణము నొందుట మంచిదని యెంచుకొనెను. కాని మఱికొంతసేపటికీ ప్రాణములమీద యాశచేత నా సాహసకృత్యమును మానివేసి, దైవికముగా వచ్చిన కష్టముల కోర్చి కష్టములవలన సహితము లాభమును బొందనేర్చుకొనుట బుద్ధిమంతుల లక్షణమని తలపోసి, తన బంధువర్గము నంతను ఒక చోట బోగుచేసి సభచేసి, యా సభలో తోక లేకపోవుటవలని లాభములగూర్చి మహోపన్యాసమొకటి చేసి, తోక త్రెంచుకొని లాభకరమయిన యీ నూతనాచారము నవలంబించి సుఖపడవలసినదని యెన్నిటికిని

హితోపదేశము చేసెను. అది చేసిన యుపన్యాసములో సామాన్యముగా తోక యనుపయుక్తమగుటయు, జల్లితోక యుండుటవలసొదలలో తగులుకొనుట మొదలయిన యనేక కష్టములుసంభవించుచుండుటయు తోక లేకపోవుటవలన శీరీరమున కధికసౌందర్యము వచ్చుటయు, వెనుకటివలె వట్టి యూహలచేతనే కాక తోకలేని సౌఖ్యమిప్పుడు తా ననుభవమువలన గనిపెట్టుటయు, పెంచి చెప్పెను. ఆ యుపన్యాసము ముగిసిన తరువాత విశేషలోకానుభవము గలిగిన ముదినక్క యొకటి ముందుకు వచ్చి యా మొండితోక యుపన్యాసమునకు నిజమయిన కారణము నూహించి తెలిసికొని "మిత్రుడా! నీవలెనేయెప్పుడైనను మేము కత్తెరబోనులో తగులుకొనుట తటస్థించినపక్షమున మేమప్పుడు స్వానుభవమువలన తోక తీసి వేసికోవలసిన యావశ్యకమును దెలిసికొని యా ప్రకారముగా జేసెదములే" అని మందహాసములో బలికి బంధుబృందమును వెంటబెట్టుకొని లేచిపోయెను.

గీ. తమదు దుష్ప్రవర్తనమున దప్పుదారి
త్రొక్కియితరుల ద్రొక్కింప దొడరువార
లన్యహితబోధకు ననర్హు లగుట తెలిసి
వారిబోధ నిరాకరింపంగ వలయు.

• • • • • • • • • • •

59. ఇంద్రుడు, లొట్టిపిట్ట

వృషభములు మొదలయిన జంతువులకు వలె గొమ్ములు గాని, యితర జంతువులకువలె నితరవిధములయిన రక్షణసాధనములుగాని తనకు లేకపోవుటచేత దేవుడు తన కన్యాయము చేసినాడని మొఱ్ఱపెట్టుకొని, ఇకనయినను దనకు దగిన పరిహారము కలుగజేయవలసినదని యొక లొట్టిపిట్ట యింద్రుని బ్రార్థించెను.

దేవునిబుద్ధికి సంతోషింపక యటువంటి తెలివి మాలిన కోరికను కోరినందునకయి యింద్రుడు దానిమీద కోపపడి "నీ బుద్ధిహీనతకు శిక్షగా నికముందు నీకు కొమ్ములు మాత్రమేకాక చెవులకూడ లేకుండ పొట్టిగా జేసెదను." అని పలికి దాని ప్రార్థన నిరాకరించి పంపివేసెను.

గీ. క్ష్మాతలంబున దనకు సౌఖ్యంబుకొఱకు
నేమి కావలెనో మర్త్యు డెఱుగలేడు,
నరుడు తా గోరునది యెల్ల బొరయునేని
పూర్వపుసుఖంబు గూడ గోల్పోవ వచ్చు.

• • • • • • • • • • •

60. కాపువాడు, కొంగ

తన చేనిలో పండిన ధాన్యమును నిత్యమును వచ్చి తిని పోవుచుండుటచేత కాకులను బాతులను పట్టుకొనుటకయి కాపువాడు పొలములో వల పన్నగా, కాకులతోను బాతులతోను వచ్చి యొక కొక్కెరకూడ దానిలోబడెను. అప్పుడాకాపు వలలోబడ్డ పక్షుల నన్నిటినిబట్టి యొక్కొక్క దానినే బాతులను కాకులను జంపుచు వాని మధ్యనున్న కొక్కెర మెడకూడ బట్టుకొని చంపబోగా, కొక్కెర తాను నిర్దోషిననియు తక్కినవానివలె తా నా చేనిలోని ధాన్యమును దొంగిలి తినుటకయి రాలేదనియు తన పోషణములో నున్న వృద్ధులయిన తల్లి తండ్రు లింట దనరాకకయి యెదురు చూచుచుందురనియు చెప్పి తనకు ప్రాణదానము చేయవలసినదని వేడుకొనెను. "నీవు చెప్పినదంతయు సత్యమే కావచ్చును. అయినను దుర్మార్గుల గుంపులో గలిసియుండగా నిన్ను బట్టుకొన్నాను. కాబట్టి నిన్నూరక విడిచిపెట్టగూడదు. దుస్సహవాసము చేసి నందునకయి నీకును దుష్టుల కర్హమైన శిక్ష కావలసినదే" అని కాపువా డుత్తర మిచ్చెను.

గీ. సర్వదా దుష్టతతితోడి సంగమంబు
పుడమిలో నాపదల కెల్ల మూల మగును;
కావున వివేకి మిత్రవర్గంబు గూర్చు
కొనుటలో నెంతొ శ్రద్ధ గైకొనగ వలయు.

• • • • • • • • • • • •

61. నెమలియొక్క మొఱ్ఱ

ఎల్లవారును మెచ్చుకొనట్లుగా కోయిల కటువంటి మృదుమధుర కంఠస్వరమును దయచేసి తనకట్టి కంఠనాదము ప్రసాదించకపోవుటచేత నన్యాయము జరిగినదనియు, తాను నోరువిప్పి పాడబోయినప్పు డెల్లరు తన వికారమయిన కీచు గొంతుకను జూచి యందఱును నవ్వుదురనియు, నెమలి దేవునితో మొఱ్ఱపెట్టుకొనెను. దేవుడు దానిని దయతో నాదరించి "కోయిలకు శ్రావ్యనాదమున్న నీ కాలోపము

కనబడకుండ నిరుపమానమయిన సౌందర్యమున్నది. కాబట్టి నీవు విచారింప వలసిన పనిలేదు." అని యోదార్చెను. "కర్ణరసాయనము లయిన పలుకులచేత నన్నది మించుచున్నప్పుడు నాకీ కేవల దేహసౌందర్యముతో నేమి ప్రయోజనము ?" అని నెమలి మరల విన్నవించుకొనెను. అప్పుడు దేవుడు దానిని జూచి 'ఓ మయూరమా! వినుము. సృష్టిలో నొక్కొక్కపక్షి కొక్కొక్క యాధిక్య మియ్యబడినది. నీకు జక్కదనమియ్యబడినది; గురుత్మంతునకు బలమియ్యబడినది; కోకిలమునకు మధురరుత మియ్యబడినది; చిలుకకు మాటాడశక్తి యియ్యబడినది. పావురమునకు సాధుత్వమియ్యబడినది. అవి యన్నియు తమ తమ స్థితులతో తృప్తిపొంది సంతోషించుచున్నవి. నీవు నిష్కారణముగా పరితాపపడుచుండ దలచుకోని పక్షమున, వాని వలెనే నీవును నీస్థితితో తృప్తినొంది సుఖించుటకు నేర్చుకొమ్ము" అని పలికి దానిని బంపివేసెను.

గీ. సకలసౌఖ్యంబులకును నీజగతిలోన
సతతమును దృప్తియే ముఖ్యసాధనంబు,
న్యాయలబ్ధంబుతో దృప్తి నందలేక
తొలగని దురాశలకు బోవ దుఃఖ మొదవు.

• • • • • • • • • • •

62. పిల్లి, పుంజు

ఒకపెంపుడు పిల్లి చిరకాలమునుండి యొక బలిసిన కోడిపుంజుమీద కన్ను వేసియుండి దానినెప్పుడయిన బట్టుకొని భక్షింపవలెనని మనస్సులో నిశ్చయించుకొని యొకనాడు ప్రాతః కాలమున నేమఱుపాటున దానిమీదపడి పట్టుకొని "ఎప్పుడును క్రిందవిడువక యొగిసి పడుచుండెదు నిన్నిప్పుడు చంపక క్షమించి విడుచుట కేదయిన హేతువున్నదా?"

అని యడిగెను. తెల్లవాఱుజామున కూసి కాలమును దెలిపి యెల్లవారిని లేపి పలకు బంపుచుండుటచే దాను మనుష్యుల కుపకారము చేయుచున్నందున తన ప్రాణము రక్షింపవలయునని పుంజు చెప్పెను. "ఓరి బుద్ధిహీనుడా ! అందుచేతనే నాకు నీమీద మహాకోపము. నీవు తెల్లవాఱుజామున లేచి కీచుగొంతుకతో నఱచి మనుష్యులకు నిద్రాభంగము చేయుచున్నావు. ఇంతకాలమునుండి నీవు ప్రతిదినమును మంచివారినిద్ర చెడగొట్టుచున్నప్పుడు నీకు తగిన శిక్ష చేయక నేనిక చూచి సహించి యూరకుండలేను. నీవిప్పుడు చెప్పుకొన్న దానివలనే నీవు వధ్యుడవని రూఢిపడుచున్నది." అని దానిని చంపి విందుగుడిచెను.

గీ. క్రూరు డొక యకృత్యము చేయగోరినపుడు
తగుసమాధానము లభించు దతక్షణంబ
తాను భక్షెను బాదంగ దలచుకొన్న,
మొదటిచెట్టుననే చువ్వ యొదవుగాదె ?

• • • • • • • • • • •

63. చిఱుతపులి, నక్క

ఒక దినము చిఱుతపుయొకటి తన శరీరముమీది మచ్చల యందమును జూచి యానందించుచు, అటువంటి చక్కని చుక్కలు లేకపోవుటచేత సింహమే తన కాలిగోరును బోలనప్పుడు తక్కినమృగము లేమిలెక్కయని మహాగర్వముతో బలికి తన్ను దామెచ్చుకొని పొగడుకొనుచుండెను. ఆ గర్వాలాపములు విని యొకనక్క తనకది పరాభవముగా భావించుకొని కోపము తెచ్చుకొని, దానిమాటలవలన దనకు మాత్రమేకాక వనములోని మృగకులమున కెల్లను గలిగిన యవమానదుఃఖము దగిన ప్రత్యుత్తర మిచ్చి పోగొట్టవలెనని

నిశ్చయించుకొని ధైర్యసాహసములతో చిఱుతపులిని జేరబోయి 'ఓ మిత్రుడా ! నీ గొప్పతనమును గూర్చి నీవిప్పుడు పడుచున్న యభిప్రాయము సరియైనది కాదు. లోకములో బుద్ధిమంతు లొకని గొప్పతనమును లోపలి గుణసామర్థ్యము లనుబట్టి నిర్ణయింతురుగాని పయితోలుయొక్క చక్కదనమును బట్టి నిర్ణయింపరు. దేహసౌందర్య మెప్పుడును మనస్సౌందర్యమునకు చాలదు సుమా!" అని పలికి దానిని తలవంచు కొనునట్లు చేసెను.

గీ. హృదయసౌందర్యమునకు నొక్కించు కైన
దేహసౌందర్య మెప్పుడు దీటురాదు
కావున నిరంతరంబును గడగవలయు
సద్గుణాలంకృతుల బూన సర్వజనులు.

● ● ● ● ● ● ● ● ● ● ●

64. నక్క, మేక

అంచుమీద కాలానుకొని నీరు త్రాగబోయి నక్క నూతిలోబడి యేవిధముచేతను బయికి రాలేకయేమియు తోచక యీ గండము గడచి నేడెట్లు గట్టెక్కి బయలబడుదునాయని యాలోచించుచుండెను. ఇంతలో గొంతసేపటికి మేక యొకటి నీరు త్రాగవలెనని నూతియొద్దనకు వచ్చి నీటిలోనున్న నక్కనుజూచి "అయ్యా! ఈనీరు తియ్యగా నున్నదా ?" అని యడిగెను. "ఈ నీరమృతప్రాయముగానున్నది. అందుచేతనే నేనీ నీరు కడుపునిండ కావలసినంత త్రాగియు వదలిపోలేక యీ నీటిలోబడి యీదులాడుకొనుచున్నాను. ఈ నీటిమాధుర్యము దీనిలో దిగి యనుభవించిన వారికిగాని తెలియదు. నీవు కూడ దిగివచ్చి దీనిచవిచూడుము." అని నక్క మిక్కిలి యాసపుట్టునట్లుగా వలికెను. ఆ మాటలు నమ్మి మాఱుమాటాడక వెంటనే మేక నీటిలో దుమికెను అప్పుడు నక్క మేకయొక్క కొమ్ములూత చేసికొని నీటి పయినుండి గట్టుమీదికి దుమికి, పయికి రాలేక నీటిలో కొట్టుకొనుచున్న మేకను నూతిలో దిగవిడిచి, హాయిగా దానిదారిని బోయెను.

గీ. కూళయును సాధు వాక్కుచో గూడిరేని,
పలువ సుజను వంచించి లాభంబు నొందు;
నిర్మలులు మాయలను బన్న నేర్వ రెపుడు,
నేర్చినను బ్రయోగింపరు నీచమతిని.

• • • • • • • • • • •

65. పడుచువాడు, పిల్లి

పిల్లియొకటి యొక పడుచువానిని జూచి కామించి వానికి భార్య కావలెనన్న యాశచేత దన్ను మనుష్యకన్యనుగా మార్చవలసినదని లక్ష్మీదేవిని వేడుకొనెను. దానిప్రార్థన నంగీకరించి భక్తసులభురాలయిన

యా దేవి పిల్లిని సుందర కన్యనుగా మార్చివేయగా, ఆ పడుచువాడు దాని సౌందర్యమును జూచి మోహించి యా కన్యను వివాహము చేసికొనెను. తరువాత నానూతనదంపతు లొకనాడు శయ్యాగృహమునందు గూరుచుండి వినోదించు చుండగా వధువు యొక్క పూర్వగుణము మాఱినదేమో పరీక్షింపవలెనని లక్ష్మీ దేవి యామెముందొక యెలుకను విడిచిపెట్టెను. ఎలుక కంటబడగానే యాక్రొత్త పెండ్లికూతురు పెండ్లికొడుకుమాట మఱచిపోయి మంచముమీదినుండి యుఱికి యెలుక వెంటబడెను. ఆ పనికి కోపమువచ్చి యన్యోన్యానుకూలమయిన గుణసంపద కలిగియుండిన గాని వధూవరులు సుఖపడజాలరని యెంచి లక్ష్మీదేవి తక్షణమే యామెను మరల మార్జాలమునుగా మార్చివేసెను.

గీ. బాల్యకాలమునుండి యభ్యాసపడిన
సహజగుణముల విడుచు టసాధ్య మెందు,
కావునను సద్గుణంబుల గరము చిన్న
నాటినుండియు మనసున నాట వలయు.

● ● ● ● ● ● ● ● ● ● ●

66. చిఱుచేప, జాలరివాడు

బెస్తవా డొకడు దినమంతయు నదిలో గాలము వేసికొని కూరుచుండగా తుద కొకచిన్న చేప గాలమును తగులు కొనెను. వాడు దానిని పయికి దీసి గాలమువదలించి బుట్టలో పడవేయ బోవుచుండగా, అది తన్ను బుట్టలో పడవేయక మరల నీటిలో బడవేయవలసినదని వానిని ప్రార్థించెను. కష్టపడి పట్టుకొన్న దానిని మరల నీటిలో నేల పడవేయవలెనని వాడడిగినప్పుడాచేప వానిని జూచి “ఓయీ ! నేనిప్పుడు పసితనములో నుండుటచేత మిక్కిలి చిన్నాదాననుగా నున్నాను. అందుచేత నీకు నేను కూరకయినను

నరిపోను. నీటిలో బడి నేనెదిగి పెద్దదాన నైనతరువాత వచ్చి నీవు నన్ను పట్టుకొన్న పక్షమున, నీవప్పుడు నామాంసముతో నీ బంధువుల కందఱికిని విందు చేయవచ్చును. కాబట్టి నన్నిప్పుడు విడిచి పెట్టి యప్పుడు వచ్చి పట్టుకొమ్ము" అని చెప్పెను. "నీవు చెప్పినదంతయు పయికి చక్కగానే కనబడుచున్నదిగాని యెప్పుడో మఱియొకప్పుడు రావచ్చునని చేతికి దొరికినప్పుడు వదలివేయుటకు నేనంత బుద్ధిహీనుడను గాను" అని పలికి వాడాచేపను బుట్టలో బడవేసెను.

గీ. ఎప్పుడో యెక్కువగ లభియించు నంచు
వట్టియాస వహించి యల్పంబు నైన
గరగతం బైనదానివి ఘనవివేకి
వెడగువడువున నెప్పుడు విడిచి చనడు.

• • • • • • • • • • •

67. గాడిద, కుక్క



ఒకానొక మనుష్యు డొకకుక్కను గాడిదను బెంచెను. కుక్క యజమానుని ముందు తోక యాడించి గంతులు వేయచుండుటయు కాలునాకి యెగిరి యొడిలోని కెక్కుచుండుటయు జూచి యా పనులవలననే యజమానుడు దానియందధిక ప్రేమ గలవాడయి తాను దిను మంచి పదార్థముల నెల్ల దానికి బెట్టుచున్నాడని తలచి తానును దానివ బ్రవర్తించి తన యజమానుని యనుగ్రహమును సంపాదించుకోవలెనని యా గాడిద నిశ్చయము చేసికొనెను. అట్లు నిశ్చయము చేసుకొన్న తరువాత గొంతసేపటికి లోపలినుండి యజమానుడు భోజనముచేసి వచ్చి వాకిట చల్లగాలికి బల్లమీద గూరుచుండెను. అతనిని చూడగానే మహాసంతోషముతో గాడిద యఱచుచు తోక యాడించుచు పరుగెత్తుకొని వచ్చి ముందటి కాళ్ళు రెండును పయికెత్తి యజమానుని ఱొమ్ముమీదబెట్టి యాతనియొడిలో దుముకబోయెను. అతడు దాని భారమును సహింపలేక వెనుక కొఱుగుచు భయపడి కేకలు వేయగా, లోపలినుండి మనుష్యులు పరుగెత్తుకొని వచ్చి దుడ్డుకఱ్ఱలతో దిట్టముగా గొట్టి యా గాడిద నావలికి సాగనంపిరి.

గీ. ప్రతిమనుష్యుడు నొక్కొక్క పనికి దాను
యోగ్యు డగుచుండు నెప్పు డీయుర్విలోన,
వాడు తన కర్త మైనట్టిపనిని విడిచి
యన్యవిధమున నటియింప హాని పొందు.

68. బిందె, కుండ

స్నానమునకు వచ్చిన వారేటియొడ్డున బెట్టుకొన్న యిత్తడిబిందె యొకటియు మట్టికుండ యొకటియు తరంగముల తాకున నీటిలో బడి ప్రవాహవేగముచేత కొట్టుకొని పోవుచుండెను. అప్పుడు కుండ

తాను పగిలిపోదునేమోయన్న భీతి చేత దూరదూరముగా తొలగ నారంభించెను. దాని భయమును జూచి బిందె బంధుత్వము తెలుపుకొని "నీకు నేనేమియు హాని రాకుండ గాపాడెదను. నీవు నావద్దకు నిర్భయముగా రావచ్చును" అని కుండతో బలికెను. "నీవు నాయందనుగ్రహించి సాధ్యమయినంత దూరముగా నుండుము. నిన్ను జూచియే నేనిప్పుడు భయపడుచున్నాను. ఏటి వడిచేత నీవు వచ్చి నామీద బడినను నేను బోయి నీమీద బడినను నాకే యపాయము సంభవించును. కొబట్టి మన మిద్దఱమును చుట్టరికమును మాని యొండొరులకు దూరముగా నుందము" అని కుండ యుత్తరమిచ్చెను.

గీ. వయసుచే విద్యచేత సంపదలచేత
దనకు సరియైన వారితోడనె కడంగి
చెలిమి యెప్పుడు జేయగ వలెనుగాని
స్థితికి దగనివారలమైత్రి చేయదగదు.

• • • • • • • • • • •

69. నక్క, కొంగ

ఒకనాడు నక్క కొంగను తనయింటికి విందుకు బిలిచి దానిని హాస్యము చేయవలెనన్న యభిలాషతో విశాలమయిన పళ్ళెములో నడుగున కొంచెము పాలుపోసి ముందుపెట్టి దానితో గలిసి బువ్వముబంతికి గూరుచుండెను. నక్క నాలుకతో నాకి పాలు త్రాగి యానందించు చుండెను గాని కొంగ తనముక్కుకొన మాత్రము పాలలో మోపగలుగుటచేత పాలు పీల్చి యనుభవింపలేక మిత్రుడు పాలు త్రాగుచున్నంత సేపును తాను గుటకలు మ్రింగుచు మారక చూచుచుండవలసిన దయ్యెను. ఆ సత్కారమును మఱచిపోక మఱునాడు కొంగ తనమిత్రమైన నక్కను మరల తనయింటికి

ప్రతిభోజనము నకు బిలిచి యొక యిరుకుమూతి కూజాలో నడుగున కొంచెము మాంసము వేసి, ముందు పెట్టి గతదినమున చేసినట్టే మిత్రునితో బువ్వము బంతికి గూరుచుండెను. మెడ సన్నమయి యిఱుకుగా నుండుటచేత కొంగ తన మెడను కూజాలో దూర్చి యడుగున నున్న మాంసపు ముక్కల నందుకొని తిని యనుభవించు చుండగానక్క యాకలిచేత బాధపడుచున్నను మూతియందులో పట్టనందున తినలేక పయియంచుమాత్రము నాకినోరుర చూపులతోనే తృప్తినొంది యూరకుండవలసిన దయ్యెను. ఆ యాదరణకు మనస్సు మండుచున్నను నక్క పయికేమియు ననలేక చెలికానివద్ద సెలవు గైకొని వెడలునప్పుడు "మిత్రుడా ! నేను నీకు మాయింట జేసిన సత్కారమునకు దగినట్టుగా నీవు నాకిప్పుడు ప్రతిసత్కారము చేయుటచే నా హృదయము పరమానందభరిత మయినది. మొట్టమొదట నీకు నేను జూపిన యుపచారగౌరమును నీవు చక్కగా నేర్చుకొని సరిగా నాయందు ప్రయోగించుటచేత నేనీ గౌరవమున కత్యంత పాత్రుడనయినానని సంతోషించుచున్నాను." అని తన కృతజ్ఞతను దెలిపి కడుపు నకనక లాడుచుండగా నెండలో బడి యింటికి నడిచెను.

గీ. ఒరుల కెట్టి సత్కృతి చేయునో జనుండు
మరల నట్టిసత్కృతి గాంచు నొరులవలన
కావున జనుండు పరిహాసకమున కైన
నొరులమనుసును నొప్పింప కుండవలయు.

70. కుక్క, నీడ



కుక్క నోట నొకమాంసపు ముద్ద గఱచుకొని యొక కొండకాలవను దాటుచు, అద్దమువలె స్వచ్ఛముగా నున్న యా నీటిలో దననీడను జూచి మఱియొక కుక్క మూంసపు ముక్కను నోట కఱచుకొని యున్నదని భ్రమపడి, దానిని కూడ తానపహరింపవలెనన్న యాశతో నోరు తెఱచి పట్టు కొనబోయెను. ఆ ప్రయత్నమువలన క్రొత్త మాంసఖండము నోకటి చిక్కక పోవుటయేకాక మునుపు తన నోటిలో నున్న మాంసఖండముకూడ నూడి నీటిలో బడి మునిగి ప్రవాహ వేగము చేత గొట్టుపోయి యదృశ్యమయ్యెను.

గీ. ఎండమావులవంటి సుఖేచ్ఛదగిలి
స్థిరసుఖము గోలుపోదురు క్షితివి నరులు,
చొచ్చి నీడల బట్టుకో జూచువారు
ఫలు చెందంగ నేర్తురే భ్రమమె కాక.

71. పావురము, చీమ

దాహము తీర్చుకటకయి చలిచీమ యొకటి యేటి యెడ్డునకు బోయి నీరు త్రాగుచుండగా తరంగ మొకటి గాలి దెబ్బచేత మీద బడినందున చీమ యేటిలో బడి కొట్టుకొని పోవ నారంభించెను. వృక్షశాఖమీద గూరుచుండి చూచుచున్న పావురము దాని దుస్థితిని జూచి జాలిపడి చెట్టు కొమ్మ యొకటి విఱిచి నీటిలో బడవైచెను. ఆ కొమ్మ పట్టుకొని బ్రతికి చీమ కొంతసేపటికి మరల దరి చేరెను. అటతరువాత గొన్నాళ్ళకు వేటగా డొక డడవికి వచ్చి కొమ్మమీద నేమఱుపాటున గూరుచుండియున్న యా పావురమును గొట్టుటకయి తుపాకిని చేతబూని గుఱి చూచుచుండెను. ఇంతలో వెనుకటి చలిచీమ పరుగెత్తుకొనివచ్చి వానిమడమమీద తేలుకుట్టినట్టు గట్టిగా కుట్టునప్పటికి వా డమ్మాయని యఱచి క్రింద చూడగా పావుర మాధ్వని విని యపాయమును తెలిసికొని యెగిరి పోయెను.

గీ. పరులకును మేలు చేసెడివాని కెపుడు
దైవమును మేలు చేయును దప్పకుండ
పరులవలనను నుపకృతి బడయువారు
ప్రత్యుపకృతి చూపగ బాటుపడుదు రెందు.

• • • • • • • • • • •

72. సింహము, గాడిద, నక్క

సంపాదించిన వేటను తమలో పంచుకొనుట కొడంబడిక చేసికొని బయలు దేఱి సింహమును గాడిదయు నక్కయు నడవికి బోయి యొక లేడిని వేటాడి చంపెను. అప్పుడు సింహము గాడిదను జూచి చచ్చిపడియున్న యా జంతువును భాగములు చేసి యా లేడిని

మూడు సమభాగములుగా భాగించి యెదుటబెట్టెను. ఆకలికొనియున్న సింహము మనస్సున కాభాగములు సరిపడనందున మృగరాజా గ్రహపడి తక్షణమే గాడిదమీద బడి తిన్నగా భాగములు చేయలేక పోయినందునకయి దానిని గోళ్ళతో జీఱి చంపివేసి, నక్కనుపిలిచి యా వేటను రెండు భాగములు చేయవలసినదని నియమించెను. నక్క వివేకియైనందున తనవంతు గిట్టలను కొంచెము కొఱుకుకొని మిగిలిన లేడినంతను సింహముయొక్క భాగముగా దూరముగా బెట్టెను. సింహము దానిబుద్ధికిని తన యెడల జూపిన గౌరవమునకు సంతోషించి, తన ఘనతకు దగినట్లుగా నిట్లు భాగములు జేయవలిసినరీతిని నీ వెవరివలన నేర్చుకొన్నావని నక్క నడిగెను. "స్వామీ ! మఱియెవరివలనను గాదు. ఏలినవారి సన్నిధానమునం దిప్పుడు చచ్చిపడి యున్న యీ గాడిదవలననే యీ నీతి నేర్చుకొన్నాను." అని నక్క యుత్తరమిచ్చెను.

గీ. తెలివి గలవాడు పరులపాటులను జూచి
యెంతయును దాను మహి బుద్ధిమంతు డగును
జనులు జగమున బరులకష్టముల జూచి
కాదె సామన్యముగ వివేకంబు గనుట ?

● ● ● ● ● ● ● ● ● ● ● ● ●

73. కౌజు, కోడిపుంజులు

ఒకకాపువాడు కౌజుపిట్ట నొకదానిని బట్టుకొని ఱెక్కలలు యికలు కొన్ని తీసివేసి దానిని కొడిపుంజులున్న దొడ్డిలో బెట్టెను. అక్కడి పుంజులా కౌజుపిట్టను ముక్కులతో బొడిచి కాళ్ళతో ఱక్కి తిండి తిననియ్యక కొంతసేపు మిక్కిలి బాధపెట్టెను. క్రొత్తగా వచ్చిన యతిథివిషయములో జూపిన యీ యనాదరమున కాపిట్ట మొట్ట

మొదట మనస్సులో దుఃఖించెను గాని యటుతరువాత పుంజు లొండొంటితో కలహించి మాటిమాటికి జగడము లాడుకొనుచుండుట చూచితమలో తామే యింత మత్సరముతోను ద్వేషముతోను పోట్లాడుచుండు పుంజు లన్యులవిషయమున నిర్దయత చూపుట యొకవింత కాదని కొంత యూఱట నొందెను.

గీ. రక్త సంబంధమున ననురాగ మూని
పరమమిత్రతతో మన వలయు వారె
యొండొరులతోడ బోరాడుచుందు రేని
పరుల కెటు వారు మైత్రి చూపంగ గలరు?

• • • • • • • • • •

74. ఎలుగుబంటి, తేనెయీగలు

ఎలుగుగొడ్డొకటి యొకకంచె కెగ్రబాకి యందు తేనె యీగలు పెట్టుకొన్న తేనె తెరలను క్రింద పడద్రోచి తేనె త్రాగ మొదలు పెట్టెను. అప్పుడు తమ సొత్తు నన్యాయముగా నపహరించి యనుభవించుచున్న మృగముమీద పగ తీర్చుకోవలెనని తేనెయీగ లాగ్రహముతో గుంపులు గుంపులుగా బయలు దేరి భల్లూకముమీద బడి శరీరమునిండ దట్టముగా నున్న బొచ్చులోదూరి కుట్టి నొప్పింపలేకపోయినను రోమములులేని ముక్కుమీదను కన్నులలోను దిట్టముగా గుట్టి తేలుకుట్టినట్ల పరిమిత బాధను గలుగజేసెను. ఎలుగుగొడ్డు దుస్సహమయిన యా బాధకును దురదకును తాళజాలక నేల మీద బడి పొరలుచు స్వయం కృతాపరాధమునకు పరితపించుచు దురద పోవుటకై వాడిగోళ్లతో గీఱుకొని మొగమును మఱింత గాయపఱుచుకొని తా నన్యులసొత్తును దురాశ చేత నక్రమముగా తస్కరించిన దోషమునకు తగిన శిక్ష ననుభవించెను.

గీ. అల్ప జనుల చేత దన కేమి హాని వచ్చు
నంచు నన్యుల కపకార మాచరింప
ఘనున కల్పులవలననే కట్టకడకు
నంగనక్తిచే వేదన నంఘటిల్లు

●●●●●●●●●●

75. దుప్పి, గుఱ్ఱము

ఒక పచ్చికబయలియందు మేయును దుప్పియు గుఱ్ఱమును గడ్డికయి తగవులాడగా దుప్పి తనవిడుదలయిన వాడి కొమ్ములతో బొడిచి గుఱ్ఱము నచ్చటినుండి తఱిమివేసెను. గుఱ్ఱమా

యవమానమును సహింపలేక పగ సాధింపవలెనన్న బుద్ధితో మనుష్యునియొద్దకు బరుగెత్తుకొనిపోయి దుప్పిని చంపుమని వేడుకొని యొప్పించి, తన కార్యమునిమిత్తమయి యతనిని తననోట కళ్ళెము

పెట్టనిచ్చి వీపుమీద నెక్కించుకొని వాయువేగమున నరణ్యమునకు దోడుకొనివచ్చెను. అతడు గుఱ్ఱ మెక్కి వచ్చి దాని యష్టప్రకారముగా దుప్పిని వేటాడి చంపెను. అంతట గుఱ్ఱమాతనిని మరల నింటికి దీసికొనిపోయి విడిచి తన కతడు చేసిన యుపకారమున కయి కృతజ్ఞతను దెలిపి నమస్కరించి సెలవు గైకొనబోగా నతడు దానిని విడువక " ఓ మిత్రమా ! నీ వింత యుపయుక్తమయిన జంతువవని నే నీవఱకెన్నడు నెఱుగను. నీ యుపయోగము నాకిప్పుడు పూర్ణముగా బోధపడినది. గాబట్టి యిక నెన్నెప్పుడును విడిచిపెట్టక నాసేవయందే యుంచుకొనెదను." అని చెప్పి నాటినుండియు గుఱ్ఱమును దనకు వాహనముగా జేసికొనెను.

గీ. ఎదకు బగదీర్చుకొనుబుద్ధి యింపె కాని
తత్ప్రయోగంబుచే ననర్థములు వచ్చు ;
ఆ పనికి దోడు తెచ్చుకొన్నట్టివారె
యెదురు తిరిగి బాధింతురు తుదను మనల.

● ● ● ● ● ● ● ● ● ●

కాకి, నక్క

గీ. కాక మెటనుండియో మాంసఖండ మొకటి
కఱచుకొని వచ్చి యొక్క వృక్షమున వ్రాలి
విందు కుడువంగ వలెనున్న వేడ్కతోడఁ
గొమ్మమీఁదను జక్కఁగాఁ గూరుచుండె.

గీ. కాకినోటను గలమాంసఖండ మరసి
దాని నెట్లైన హరియింప దలఁచి నక్క
చెట్టు మొదటికి మెల్లఁగా జేర వచ్చి
యింపు గులకంగఁ గాకికి నిట్టు లనియె.

గీ. "అన్న ! యెన్నాళ్ళకును గల్గె నిన్ను జూడ !
నేడుగా పండువు మదీయ నేత్రములకు !
నీదుసౌందర్యమహిమంబు నిపుణముగను
బ్రహ్మదేవుని కైనను వశమె పొగడ ?"

గీ. "అహహ ! నీల మేఘచ్ఛాయ నడఁచు మేను !
చక్రముల మించు నీదులోచనయుగంబు;
నిక్క వింజామరల మిఱు ఱెక్కలౌర !
నవ్వెడు హంసముల నీదునడక తీరు".

గీ. "ఏమి నాభాగ్యమియ్యెడ నింతతడవు !
కనులు తనియంగ నీరూపు కాంచ గలిగె !

చూచుకొలదిఁని నొక క్రొత్తసోయగంబుఁ
గూర్చుచును నెంతకును దృష్టికొలువ దహహ!"

గీ. "పుడమిపైనె నొక్క సౌందర్యముననె కాదు
కాక రాజమ ! నీవు ప్రఖ్యాతి గనుట
నీదుకంఠస్వరము గూడ నిరుపమాన
మఖిలజంతువులందు నీయవనిమీద".

గీ. "సఖుడ ! భువిలోన నీతోడ సమము గాఁగ
నింపుగా గాన మొనరింప నెవరు గలరు ?
పెదవి కదలించి యొక్కింత వీను లలరఁ
బలికి తేనియుఁ దేనియ లొలుకుఁ జుమ్మి.

గీ. "సఖుడ ! నీ గానరస మింత చవి గొనంగ
వేచి యున్న యీ చెవులకు విందుగాఁగ
గానసుధ యింత వర్షించితేని, నన్నుఁ
బోలుధన్యుఁ డింకొకఁ డుండఁ బోవ డెందు"

గీ. అని ముఖస్తుతు లొనరింప నాత్మ నలరి
కాయ ముప్పొంగ నా వెఱ్ఱికాకి యపుడు
తనదుసంగీతమును గూడ ఘనత మీఱుఁ
బాడి శాశ్వతకీర్తిని బడయఁ దలఁచి.

గీ. నక్క జిత్తులు కనక గానంబు చేయఁ
గోరి యుత్సాహ మడరంగ నోరు తెఱచి

కావు కా వనికూసె; నాక్షణమునందె
యూడి పడె నీటిమాంసంబు నుర్విమీఁద.

గీ. పుడమి మాంసంబు పడుటయే తడవు గాఁగ
నక్కపోతును మాంసపుముక్క గొనుచుఁ
జాడ్కి నిగిడించి వెఱఁ గంది చూచుచున్న
కాకిమిత్రుని చెట్టుపై గాంచి పలికె.

గీ. "వెడఁగుకాకమ ! నేనింతతడవు నిన్నుఁ
నూరక స్తుతింతునే లాభ మొదవ కుండ ?
నాదువని తీఱెఁ బోయెద; నీదుపాట
యుంచుకొమ్ము నీయొద్దనే" యందుఁ జనియె.

గీ. వసుధలోపల నరులను బాడు చేయ
స్తోత్రపాఠుల మించుశత్రువులు లేరు
లాభ మొంద ముఖస్తుతు ల్సలునువారి
వలలఁదగులక కనుగల్గి మెలగ వలయు.

* * *